Follow: @ANNTELUGU

03-10-2026

ANN తెలుగు

# మహా పత్రిక

శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 252 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM





## ఆర్ బీఎం మెగా బిజినెస్ కాంక్లేవ్ విజయవంతం

- శివప్రసాద్ ఆధ్వర్యంలో భారీ కార్యక్రమం
- మీడియా పార్ట్ నర్ గా వ్యవహరించిన ఏఎన్ఎన్

**హైదరాబాద్, మహా :** రియల్ బిజినెస్ మ్యాట్రిక్స్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం టూరిజం ప్లాజాలో నిర్వహించిన మెగా బిజినెస్ కాంక్లేవ్ విజయవంతమైంది. విభిర్న వ్యాపారరంగాలకు చెందిన ప్రముఖులు ఈ కాంక్లేవ్ కు హాజరు కాగా, అమ్మన్యూస్ నెట్ వర్క్ (ఏఎన్ఎన్) మీడియా పార్ట్ నర్ గా వ్యవహరించింది. ఈ సందర్భంగా ఆర్ బీఎం బిజినెస్ న్యూస్ మ్యాగజైన్ శివప్రసాద్ ఆధ్వర్యంలో రూపుదిద్దుకోగా, ఆవిష్కరణ జరిగింది. హరే కృష్ణ ఫౌండేషన్ సీఈవో కాంతేయ దాస ఈ సందర్భంగా అక్షయపాత్ర ఫౌండేషన్ సేవలకు బహుకరించిన సోషల్ ఇంపాక్ట్ అవార్డు అందుకున్నారు. వివిధ రకాల వ్యాపారాలకు సంబంధించిన ప్రజంటేషన్లు చేశారు. ఈ సందర్భంగా ఎఎన్ఎన్ సీఈవో కంది రామచంద్రారెడ్డికి జ్ఞాపిక, బహుమతి అందించారు. ఎఎన్ఎన్ సహకారాన్ని, వార్తాప్రపంచంలో ఎఎన్ఎన్ పురోగతిని అతిథులు ప్రశంసించారు.





టాప్ న్యూస్

### నేనే ఖైరతాబాద్ ఎమ్మెల్యే



- దానం ఎన్నిక చెల్లదు
- కాంగ్రెస్ నేత విజయారెడ్డి కాన్ఫిడెన్స్

02

### భారత్‌లో ధర్మం–దేశం వేర్వేరు కావు



- ప్రపంచ సమస్యలకు భారతీయ జ్ఞానమే మార్గదర్శకం
- మోహన్ భగవత్

03

### రేవంత్, కేటీఆర్ ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి



- ఎంపీ రఘునందన్ డిమాండ్
- సోమవారం లోగా హైకోర్టుకు లేఖ రాయాలి.. లేదంటే నేనే రాస్తా

03



## వివేకా హత్య కేసులో ఎంపీ అవినాష్ రెడ్డికి ఈడీ నోటీసులు

- రూ.40 కోట్ల ఆర్థిక లావాదేవీలపై ఆరా.
- అక్టోబర్ 14న విచారణకు పిలుపు

**హైదరాబాద్, మహా :** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఆర్థిక లావాదేవీలు, మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తాజాగా కడప వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి నోటీసులు జారీ చేసింది. అక్టోబర్ 14న హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో విచారణకు

మిగతా 2వ పేజీలో



## డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా సెంట్రల్ కిచెన్ల ప్రారంభం

### కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానంగా సెంట్రల్ కిచెన్లు

- సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి
- విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కోసం హరేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందం
- నాగర్‌కర్నూల్‌లో కిచెన్ కోసం జున్నా సోలార్ సిస్టమ్స్ రూ.5.17 కోట్ల విరాళం

**హైదరాబాద్, మహా :** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్లను డిసెంబరు 9న ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. నవంబర్ 30 నాటికి కిచెన్ల నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కోసం హరేకృష్ణ ఫౌండేషన్‌తో జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు సీఎం సమక్షంలో ఒప్పందం చేసుకున్నాయి. నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లో కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు ఈ సంస్థలు సహకారం అందించనున్నాయి. జున్నా సోలార్ సిస్టమ్స్ సంస్థ నాగర్‌కర్నూల్‌లో కిచెన్ కోసం రూ.5.17 కోట్ల చెక్కు ఇచ్చింది. వికారాబాద్‌లో సెంట్రలైజ్డ్ కిచెన్ కోసం చైన్ ల్యాబ్స్ రూ.4 కోట్ల చెక్కును అందించింది. జున్నార్ సోలార్ సిస్టమ్స్ సీఎండీ శేఖర్‌రెడ్డి, సీఈవో అనిల్‌బాబు, చైన్ ల్యాబ్స్ ప్రతినిధి సమంత డే, వైస్ ప్రెసిడెంట్

మిగతా 2వ పేజీలో

## నన్ను ఆంధ్రా బిడ్డగా భావించండి



**ఏపీకి ఏం చేయగలనో గైడ్ చేయండి**

- సీఎం చంద్రబాబును కోరిన అనంత్ అంబానీ
- మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రారంభోత్సవంలో మాట్లాడిన అనంత్ అంబాని

**మదనపల్లె, మహా :** తనను ఆంధ్రా బిడ్డగా భావించాలని.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తానేం చేయగలనో గైడ్ చేయాలని సీఎం చంద్రబాబును అనంత్ అంబానీ కోరారు. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లెలో ఏర్పాటు చేస్తున్న గ్లోబల్ హార్టికల్చర్ హబ్ దేశ అభివృద్ధిలో కీలక భాగమవుతుందని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ అనంత్ అంబానీ అన్నారు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఎంతో మంది యువ పారిశ్రామికవేత్తలు, రైతులకు కొత్త ఆశలు కల్పించగా, వారి కల సాకారం చేసుకునే దిశగా ఏపీ ప్రభుత్వం అవకాశాలు సృష్టిస్తుందన్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అభివృద్ధి చేస్తున్న గ్రామీణ ప్రాంతాలు, పంచాయతీ రాజ్ వ్యవస్థలో చేస్తున్న మార్పులు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. అటవీ శాఖ, పర్యావరణం పట్ల ఆయన చూపిస్తున్న ప్రేమ.. వాటిని పరిరక్షించేందుకు ఆయన తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో శుక్రవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి రాయలసీమ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ఐఎస్ఏ)లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో

మిగతా 3వ పేజీలో



తెలంగాణ జన సమితి అధ్యక్షుడు

## కోదండరామ్ మౌనదీక్ష

**హైదరాబాద్, మహా :** తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరాం నేడు మౌనదీక్ష చేపట్టారు. రాష్ట్రంలోని టీజేఎస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఈ నిరసన కార్యక్రమం కొనసాగుతోంది. ఎన్నికల సంఘం అవలంబిస్తున్న కొన్ని విధానాలు, నిబంధనలను నిరసిస్తూ ఆయన ఈ మౌనదీక్షకు దిగారు.



## సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాల్సిందే'

- కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్
- ముంబయి శివాజీ పార్క్‌లో భారీ నిరసన

**ముంబై, మహా :** మహారాష్ట్ర రాజధాని ముంబయిలో శుక్రవారం కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన జరిగింది. సర్ ప్రక్రియలో అక్రమాలు, అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్న సీజేపీ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తోంది. ఈ క్రమంలోనే అభిజిత్ దీప్కే నేతృత్వంలోని సీజేపీ పిలుపు మేరకు ముంబయి శివాజీ పార్క్‌లో నిరసనకు వేలాది మంది యువకులు, విద్యార్థులు, పౌర సమాజ ప్రతినిధులు తరలివచ్చారు. ఈ ఆందోళనలో గాంధీ కుటుంబానికి చెందిన తుషార్ గాంధీ, ప్రముఖ బాలీవుడ్

మిగతా 2వ పేజీలో

తెలంగాణలో

## 92 లక్షల మందికి నోటీసులు

- 65 లక్షల మంది స్పందన... ఖైరతాబాద్‌లో 80 వేల మందికి నోటీసులు.
- సర్ గడువు మరోసారి పొడిగించం: సీఈఓ

02



### ఫ్లై దుబాయ్ విమాన ఘటన

## పైలట్ స్మిత్ మచ్చర్‌తో మాట్లాడిన ప్రధాని మోదీ

- ఫ్లై దుబాయ్ విమాన ఘటన
- పైలట్ స్మిత్ మచ్చర్‌తో మాట్లాడిన ప్రధాని మోదీ
- మోదీ వీడియో కాల్ ద్వారా సంభాషణ
- ఎవరి ప్రాణాలు పోవొద్దనే ప్రార్థించానన్న స్మిత్
- అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చిన ప్రధాని

03





## ఆరుగురు పతివ్రతలు మళ్లీ

**మహా :** టాలీవుడ్‌లో ప్రస్తుతం రీరిలీజ్ ట్రెండ్ జోరుగా సాగుతోంది. పాత కాలపు బ్లాక్ బస్టర్ హిట్లు, ప్రేక్షకుల మనస్సుల్లో నిలిచిపోయిన కల్ట్ క్లాసిక్ సినిమాలను నూతన 4కే టెక్నాలజీతో మళ్లీ థియేటర్లలోకి తీసుకువస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం తన బోల్డ్ అండ్ రియలిస్టిక్ కంటెంట్‌తో టాలీవుడ్‌లో పెద్ద సెన్సేషన్ సృష్టించిన కల్ట్ క్లాసిక్ మూవీ 'ఆరుగురు పతివ్రతలు'మళ్లీ థియేటర్లలోకి రావడానికి సిద్ధమైంది. దివంగత ప్రముఖ డైరెక్టర్ ఈవీవీ సత్యనారాయణ తన సొంత నిర్మాణ

మిగతా 2వ పేజీలో



# వివేకా హత్య కేసులో ఎంపీ అవినాష్ రెడ్డికి ఈడీ నోటీసులు

( మొదటి పేజీ తరువాయి )



వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది. 2019లో జరిగిన వివేకానందరెడ్డి హత్యకు సంబంధించిన ఆర్థిక మార్గాలపై ఈడీ దర్యాప్తు కొనసాగిస్తోంది.వివేకా హత్యకు సంబంధించి రూ.40 కోట్ల ఆర్థిక ఒప్పందం జరిగిందన్న ఆరోపణలపై ఈడీ ప్రధానంగా దృష్టి సారించింది. హత్య కేసులో నిందితులకు జరిగినట్లు ఆరోపిస్తున్న చెల్లింపులు, నిధుల మూలాలు, నగదు బదిలీలు, బ్యాంకు లావాదేవీలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ వ్యవహారంలో నిధులు ఎక్కడి నుంచి వచ్చాయి, ఎవరికి చేరాయి అనే అంశాలను మనీలాండరింగ్ కేసు పరిధిలో ఈడీ పరిశీలిస్తోంది. సీబీఐ నమోదు చేసిన కేసు, అనంతరం దాఖలు చేసిన ఛార్జిషీట్ల ఆధారంగా ఈడీ 2025 ఆగస్టులో మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ చట్టం కింద దర్యాప్తు కొనసాగిస్తోంది. సీబీఐ దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన ఆర్థిక అంశాలను ప్రత్యేకంగా పరిశీలిస్తూ నిధుల కదలికలను అనుసరిస్తోంది. ఇప్పటికే ఈ కేసులోని పలువురు నిందితులను ఈడీ అధికారులు ప్రశ్నించారు. అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరితో పాటు ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్ రెడ్డిలను విచారించారు. సెప్టెంబర్ 25న సునీల్ యాదవ్, సెప్టెంబర్ 28, 29 తేదీల్లో ఎర్ర గంగిరెడ్డిని విచారించినట్లు తాజా నివేదికలు వెల్లడించాయి. వారి వాంగ్మూలాలు, బ్యాంకు లావాదేవీల వివరాలను ఈడీ పరిశీలిస్తోంది. దర్యాప్తులో భాగంగా ఆగస్టు 21న హైదరాబాద్, కడప ప్రాంతాల్లో ఈడీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. అవినాష్ రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్ రెడ్డికి సంబంధించిన ప్రాంగణాలతో పాటు కేసుతో సంబంధం ఉన్న ఇతర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సోదాల్లో ఆర్థిక పత్రాలు, డిజిటల్ పరికరాలతో పాటు లెక్కల్లో చూపని రూ.24 లక్షల నగదు, రెండు బ్యాంకు లాకర్ల తాళాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారికంగా వెల్లడైన వివరాలను ఉటంకిస్తూ వార్తా సంస్థలు తెలిపాయి. హత్య కేసులో నిందితులకు అందినట్లు ఆరోపిస్తున్న నగదు చెల్లింపులపైనా ఈడీ దృష్టి పెట్టింది. దస్తగిరికి ఇచ్చినట్లు ఆరోపిస్తున్న రూ.1 కోటి ముందస్తు చెల్లింపు, మరో రూ.4 కోట్ల నగదు బదిలీకి సంబంధించిన అంశాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. 2019 నుంచి సంబంధిత వ్యక్తుల బ్యాంకు ఖాతాలు, నిధుల కదలికలను పరిశీలిస్తూ ఆర్థిక మార్గాన్ని గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు.

**అక్టోబర్ 14న అవినాష్ రెడ్డి విచారణ**

ఈ నేపథ్యంలో అవినాష్ రెడ్డికి ఈడీ నోటీసులు జారీ చేయడం కేసు దర్యాప్తులో తదుపరి కీలక పరిణామంగా మారింది. అక్టోబర్ 14న విచారణకు హాజరైనప్పుడు హత్యకు ముందు, అనంతరం జరిగినట్లు దర్యాప్తు సంస్థ గుర్తించిన ఆర్థిక లావాదేవీలు, నిధుల కదలికలు, ఇతర నిందితులతో సంబంధిత ఆర్థిక అంశాలపై ప్రశ్నించే అవకాశం ఉంది. అయితే ఈడీ దర్యాప్తులో నమోదైన ఆరోపణలు తుది నిర్ధారణకు వచ్చినట్లు భావించరాదు; కేసు న్యాయపరమైన దర్యాప్తు దశలోనే ఉంది.

# విద్యుత్ కొరత లేకుండా చర్యలు

**ఇతర రాష్ట్రాల నుంచి 19 వేల మెగావాట్లకు పైగా కొనుగోలు.**

**రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి .**



నల్గొండ, మహా : తెలంగాణలో ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం నల్గొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ విద్యుత్ కొరత తలెత్తకుండా ఇతర రాష్ట్రాల నుంచి 19 వేల మెగావాట్లకు పైగా విద్యుత్ కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించారు. యాదాద్రి ప్లాంట్ పై ప్రత్యేక దృష్టి: యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని పూర్తిస్థాయి సామర్థ్యంతో అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. సింగరేణి బొగ్గు అనుసంధానం, నైనీ బొగ్గు బ్లాక్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించి బొగ్గు సరఫరాను పునరుద్ధరించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా దసరాలోపు యాదాద్రి కేంద్రంలో పూర్తిస్థాయి విద్యుదుత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనడాన్ని ప్రతిపక్షాలు రాజకీయంగా ఉపయోగించుకుంటున్నాయని కోమటిరెడ్డి విమర్శించారు. ప్రభుత్వం రైతులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో విద్యుత్, కరవు పరిస్థితులపై సుమారు ఐదు గంటల పాటు చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. నల్గొండ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి ద్వారా నియోజకవర్గానికి 5,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధిస్తారని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.



# సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాల్సిందే

( మొదటి పేజీ తరువాయి )

నటులు షబానా అజ్మీ, నసీరుద్దీన్ షా, సంగీత దర్శకుడు విశాల్ దద్లానీ కూడా పాల్గొని మద్దతు తెలిపారు. రాజకీయ పార్టీలు శివసేన , మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన పార్టీలు కూడా నిరసనకు తమ మద్దతు ప్రకటించాయి. నిరసనకారుల్ని ఉద్దేశించి ప్రసంగించిన సీజేపీ నాయకుడు అభిజిత్ దీప్కే, నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అసమర్థంగా ఉందని విమర్శించారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై జంతర్ మంతర్ వద్ద ఆందోళనలు జరిగిన 2 నెలల వ్యవధిలోనే మరోసారి తాము నిరసన చేపట్టాల్సి వచ్చిందని అన్నారు. మరోవైపు సీఈసీ తప్పక రాజీనామా చేయాల్సిందేనని, నేర విచారణ ఎదుర్కోవాల్సిందేనని దాదర్‌లో జరిగిన నిరసనలో సీజేపీ నాయకుడు అజింక్యా శిందే డిమాండ్ చేశారు. ఇంకా ఢిల్లీ పోలీసులు మళ్లీ క్రూరంగా ప్రవర్తించారని, మారండి లేకపోతే తామే మారుస్తామని సీజేపీ నాయకుడు సౌరవ్ దాస్ హెచ్చరించారు. అంతకుముందు అక్టోబర్ 2న శివాజీ పార్క్‌లో మధ్యాహ్నం 4 గంటలకు నిరసన చేపడతామని సీజేపీ ముందుగానే హెచ్చరించింది. పోలీసుల నుంచి అనుమతి లభించకపోయినప్పటికీ నిరసన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో యువత తరలివచ్చింది. నిరసన నేపథ్యంలో శివాజీ పార్క్ పరిసరాల్లో భారీగా పోలీసులు, భద్రతా సిబ్బందిని మోహరించారు. సమీపంలోని దాదర్ రైల్వే స్టేషన్ నుంచి వచ్చే మార్గాల్లో బారికేడ్లను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ పెద్ద సంఖ్యలోనే యువత శివాజీ పార్క్ వద్ద నిరసన ప్రాంతానికి చేరుకుంది. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ త్రివర్ణ పతాకాలతో పాటు వివిధ ప్లకార్డులను ప్రదర్శించారు.

# డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా సెంట్రల్ కిచెన్ల ప్రారంభం

( మొదటి పేజీ తరువాయి )



బుగత సంతోష్‌కుమార్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. క్యాలరీలను లెక్కించడానికి యాప్ వినియోగించాలి సెంట్రలైజ్డ్ కిచెన్లన్నింటినీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆహార నాణ్యత విషయంలో జాగ్రత్తలు పాటించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల క్యాలరీలను లెక్కించడానికి యాప్‌లను ఉపయోగించుకోవాలని సీఎం సూచించారు. ప్రాంతాల వారీగా అక్కడి అలవాట్లకు అనుగుణంగా బ్రేక్‌ఫాస్ట్ తయారు చేయాలన్నారు. బ్రేక్‌ఫాస్ట్ వల్ల విద్యార్థులు సమయానికి పాఠశాలకు చేరుకుంటారని సీఎం తెలిపారు. విద్యార్థులు కిచెన్లను సందర్శించేలా చర్యలు తీసుకోవాలని, ఇది శాశ్వతంగా కొనసాగే కార్యక్రమం అయినందువల్ల అధికారులు అత్యంత జాగ్రత్త వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల ట్రాక్ రికార్డును నమోదు చేయాలని సీఎం రేవంత్ అధికారులకు సూచించారు. విద్యార్థుల శారీరక పెరుగుదల, విద్యా పురోగతి వంటి అంశాలను ఎప్పటికప్పుడు రికార్డు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, హరే కృష్ణ ప్రతినిధి సత్య గౌర చంద్ర దాస్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో 92 లక్షల మందికి నోటీసులు

- **65 లక్షల మంది స్పందన... ఖైరతాబాద్‌లో 80 వేల మందికి నోటీసులు.**
- **సర్ గడువు మరోసారి పొడిగించం: సీఈఓ**



**హైదరాబాద్, మహా** : తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 92 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయగా, ఇప్పటివరకు 65 లక్షల మంది స్పందించినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో 80 వేల మందికి నోటీసులు ఇవ్వగా, ఇప్పటివరకు 20 శాతం మంది స్పందించినట్లు ఆయన వెల్లడించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు సంబంధిత పత్రాలు సమర్పించేందుకు ప్రత్యేకంగా కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదని సీఈఓ తెలిపారు. బూత్ స్థాయి అధికారులు నేరుగా ఓటర్ల ఇళ్లకు వెళ్లి అవసరమైన పత్రాలను సేకరిస్తున్నారని చెప్పారు. కుటుంబంలోని నోటీసులు అందుకున్న సభ్యులందరూ ఒకేసారి ఇంట్లో ఉండాల్సిన అవసరం లేదని, కుటుంబంలో ఒక్కరు అందుబాటులో ఉండి మిగిలిన సభ్యుల వివరాలు అందిస్తే సరిపోతుందని స్పష్టం చేశారు. ఇప్పటివరకు స్పందించిన 65 లక్షల మందిలో 54 లక్షల మంది వివరాలను పరిశీలించి తుది ఓటరు జాబితాలోకి తీసుకొచ్చినట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. మిగిలిన వారి వివరాలను కూడా నిర్ణీత గడువులోగా పరిశీలించి ప్రక్రియను పూర్తి చేయాలని ఎన్నికల యంత్రాంగం చర్యలు చేపడుతోందన్నారు.

**ఖైరతాబాద్‌పై ప్రత్యేక దృష్టి**

ఖైరతాబాద్ నియోజకవర్గంలో 80 వేల మందికి నోటీసులు జారీ చేసినట్లు సీఈఓ వెల్లడించారు. తొలుత 20 శాతం మంది స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు. నోటీసులు అందుకున్నవారి ఇళ్లకు బీఎల్వోలు వెళ్లి పత్రాలను సేకరించాల్సిందేనని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఓటర్లను ఒకే చోటకు పిలిపించి ప్రక్రియ పూర్తి చేయడం కాకుండా ఇంటివద్దే వివరాలు సేకరించే విధానాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ గడువును మరోసారి పొడిగించే ఉద్దేశం లేదని సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 7 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించనున్నారు. నవంబర్ 5 వరకు నోటీసుల జారీ, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ కొనసాగుతుంది. నవంబర్ 9న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు ఆయన తెలిపారు.

**ఫారమ్-6కు డిక్లరేషన్ తప్పనిసరి**

తెలంగాణలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నందున కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారు ఫారమ్ 6తో పాటు డిక్లరేషన్ కూడా సమర్పించాల్సి ఉంటుందని సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తయిన రాష్ట్రాలకు మాత్రమే ఈ డిక్లరేషన్ నుంచి మినహాయింపు ఉందని తెలిపారు. నోటీసులు అందుకున్న వారిలో ఎవరైనా ప్రస్తుతం వేరే ప్రాంతానికి వలస వెళ్లి ఉంటే వారిని తప్పనిసరిగా కార్యాలయానికి పిలవాల్సిన అవసరం లేదని సీఈఓ తెలిపారు. సంబంధిత ఎన్నికల నమోదు అధికారులు ఆన్‌లైన్ ద్వారా వారిని సంప్రదించి అవసరమైన ప్రక్రియను పూర్తి చేస్తారని వెల్లడించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక సమగ్ర సవరణను పూర్తి చేయడమే ఎన్నికల సంఘం లక్ష్యమని పేర్కొన్నారు.

# మహిళలకు మరింత విస్తృతంగా ఉచిత బస్సు ప్రయాణం

**గాంధీ జయంతి రోజున 'వెట్రి పయనం' విస్తరణ.**

**రోజుకు 84.32 లక్షల మందికి ప్రయోజనం**



చెన్నై, మహా : తమిళనాడు ప్రభుత్వం మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు అందిస్తున్న ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని మరింత విస్తరించింది. గాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ శుక్రవారం 'వెట్రి పయనం' పథకాన్ని విస్తరించి ప్రారంభించారు. చెన్నైలో బస్సులో ప్రయాణించిన ఆయన మహిళా ప్రయాణికులకు స్వయంగా ఉచిత టికెట్లు అందించారు. విస్తరించిన పథకం ద్వారా రోజుకు సుమారు 84.32 లక్షల మంది మహిళలు ప్రయోజనం పొందనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

**ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం**

ఇప్పటివరకు సాధారణ పట్టణ, నగర బస్సులకే ప్రధానంగా పరిమితమైన ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ఇప్పుడు ఎక్స్‌ప్రెస్, పరిమిత స్టాప్, డీలక్స్ బస్సులకు కూడా విస్తరించారు. పట్టణ ప్రాంతాలతో పాటు దీర్ఘదూరాల్లో నడిచే సాధారణ బస్సులు, కొండ ప్రాంతాల్లోని కొన్ని సాధారణ సర్వీసులకు కూడా ఈ ప్రయోజనం వర్తించనుంది. దీంతో మహిళలు విద్య, ఉద్యోగం, వైద్యం, ఇతర అవసరాల కోసం ఎక్కువ దూరం ప్రయాణించినా రవాణా ఖర్చు తగ్గనుంది.

**12,692 బస్సులకు పథకం వర్తింపు**

రాష్ట్రంలోని ఏడు ప్రభుత్వ రవాణా సంస్థలు నడుపుతున్న 18,413 షెడ్యూల్డ్ బస్సుల్లో 12,692 బస్సులకు ఈ పథకం వర్తించనుంది. అంటే మొత్తం బస్సుల్లో సుమారు 69 శాతం బస్సులు ఉచిత ప్రయాణ పరిధిలోకి వస్తాయి. రోజువారీగా 84.32 లక్షల మంది మహిళలు లబ్ధి పొందుతారని ప్రభుత్వం అంచనా వేసింది.

**ఆదాయ పరిమితి లేదు**

'వెట్రి పయనం' పథకంలో ప్రయోజనం పొందేందుకు ఆదాయ పరిమితి విధించలేదు. రోజులో ఎన్ని సార్లు ప్రయాణించాలన్న దానిపైనా పరిమితి ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. మహిళలతో పాటు ట్రాన్స్‌జెండర్లకు కూడా ఈ సౌకర్యం వర్తిస్తుంది. రవాణా ఖర్చు విద్య, ఉద్యోగం, వైద్యం వంటి అవకాశాలకు అడ్డంకిగా మారకూడదన్న ఉద్దేశంతో పథకాన్ని విస్తరించినట్లు ప్రభుత్వం తెలిపింది.

**మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదం**

మహిళలు కళాశాలలు, ఉద్యోగాలు, వ్యాపారాలు, వైద్య సేవలు, ఇతర అవసరాల కోసం స్వేచ్ఛగా ప్రయాణించే అవకాశాన్ని పెంచడం పథకం లక్ష్యాల్లో ఒకటిగా ప్రభుత్వం పేర్కొంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాలకు దూరంగా ఉన్న మహిళలు కూడా ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వచ్చినప్పుడు రవాణా ఖర్చు తగ్గడం ద్వారా కుటుంబంపై ఆర్థిక భారం తగ్గుతుందని ప్రభుత్వం తెలిపింది.

**సెప్టెంబర్‌లో ప్రైవేటు బస్సు యజమానుల అభ్యంతరం**

పథకం విస్తరణపై తమిళనాడులోని ప్రైవేటు బస్సు యజమానుల సంఘాలు గత నెలలో అభ్యంతరం వ్యక్తం చేశాయి. ప్రభుత్వ బస్సుల్లో మరిన్ని సర్వీసులకు ఉచిత ప్రయాణం వర్తింపజేయడం వల్ల తమ ప్రయాణికులు, ఆదాయం తగ్గే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 28న నిరసనగా 24 గంటల బంద్‌కు పిలుపునిచ్చినా, అనంతరం ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు.

# రామాలయ సిబ్బంది వివరాలపై ఇక పూర్తి ధ్రువీకరణ

**ఉద్యోగుల కుటుంబ వివరాలూ సేకరణ.**

**అయోధ్య, మహా :** అయోధ్య రామమందిరంలో విరాళాల నగదు అక్రమంగా తరలించిన ఘటనలపై దర్యాప్తు నేపథ్యంలో ఆలయ సిబ్బంది ధ్రువీకరణ ప్రక్రియను మరింత కట్టుదిట్టం చేయాలని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నిర్ణయించినట్లు సమాచారం. ఆలయంలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను పూర్తిస్థాయిలో ధ్రువీకరించడంతో పాటు పోలీసు పరిశీలన, ప్రవర్తనకు సంబంధించిన వివరాలు, కుటుంబ సభ్యుల సమాచారాన్ని సేకరించే ప్రక్రియ చేపట్టినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆలయంలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి, సిబ్బంది వివరాలను సమగ్రంగా నమోదు చేయడంతో పాటు స్థానిక పోలీసుల నుంచి ప్రవర్తనా ధ్రువీకరణ పత్రాన్ని తీసుకునే విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఉద్యోగితో పాటు కుటుంబ సభ్యులు, బంధువులకు సంబంధించిన వివరాలను కూడా నమోదు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఆలయ భద్రత, విరాళాల నిర్వహణలో పారదర్శకతను పెంచే చర్యల్లో భాగంగానే ఈ మార్పులు చేపడుతున్నట్లు ట్రస్ట్ వర్గాలు చెబుతున్నాయి. విరాళాల వ్యవహారంపై ఆరోపణలు వెలుగులోకి వచ్చిన అనంతరం ట్రస్ట్ పరిపాలనా వ్యవస్థలో కూడా మార్పులు చోటుచేసుకున్నాయి. జూలైలో ట్రస్ట్ సమావేశం అనంతరం అప్పటి ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, సభ్యుడు అనిల్ మిశ్రా రాజీనామాలను ట్రస్ట్ ఆమోదించింది. అదే సమయంలో ఆలయ రోజువారీ నిర్వహణను మరింత సంస్థాగతంగా చేపట్టేందుకు ప్రధాన కార్యనిర్వహణాధికారి పదవిని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. విరాళాల నగదు వ్యవహారంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సాగుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం దర్యాప్తులో 105 సందర్భాల్లో నగదును అనధికారికంగా తొలగించడం లేదా దాచిపెట్టడం జరిగినట్లు గుర్తించింది. ఆలయంలోని యాత్రికుల సౌకర్య కేంద్రంలోని లెక్కింపు గదికి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు, నగదు లెక్కింపు రికార్డులు, ఇతర డిజిటల్ ఆధారాలను పరిశీలించిన అనంతరం ఈ వివరాలు వెలుగులోకి వచ్చినట్లు సిట్ నివేదికలో పేర్కొంది.

**లెక్కింపు కేంద్రంలోనే నగదు అక్రమ తరలింపు**

సిట్ దర్యాప్తు ప్రకారం నగదు లెక్కింపు సమయంలోనే అక్రమంగా నగదును తీసుకోవడం లేదా దాచడం జరిగినట్లు ఆధారాలు లభించాయి. లెక్కింపు కేంద్రం నుంచి బ్యాంకులకు నగదు తరలించే దశలో మాత్రం నగదు మళ్లింపు జరిగినట్లు ఆధారాలు లభించలేదని దర్యాప్తు వర్గాలు తెలిపాయి. సీసీటీవీ దృశ్యాల్లో కొందరు లెక్కింపు సిబ్బంది నోట్ల కట్టలను దుస్తులు, సాక్సులు తదితరాల్లో దాచినట్లు గుర్తించినట్లు వెల్లడైంది.

## నేనే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం ఎన్నిక చెల్లదు

**కాంగ్రెస్ నేత విజయారెడ్డి కాన్ఫిడెన్స్**

**హైదరాబాద్, మహా :** ఎన్నికల పిటిషన్ వేశానని, కోర్టుపై పూర్తి నమ్మకం ఉందని కాంగ్రెస్ నేత విజయారెడ్డి తెలిపారు. దానం ఎన్నిక చెల్లకపోతే తననే ఎమ్మెల్యేగా ప్రకటించే అవకాశం ఉందన్నారు. ఎన్నికల పిటిషన్‌పై తీర్పు రాకుండా ఉపఎన్నిక వద్దని సుప్రీంకోర్టు తీర్పు ఉన్నట్లు గుర్తుచేశారు. తన పిటిషన్ పక్కన పెడితే కారణాలపై మళ్లీ కోర్టుకు వెళ్తానని విజయారెడ్డి వెల్లడించారు. ఉపఎన్నిక వస్తే అధిష్ఠానం ఏం చేస్తుందో చూడాలని విజయారెడ్డి అన్నారు.

## ఆరుగురు పతివ్రతలు మళ్లీ

మొదటి పేజీ తరువాయి

సంస్థ "ఈవీవీ సినిమా" బ్యానర్‌పై ఈ సినిమాను స్వయంగా నిర్మించి, దర్శకత్వం వహించారు. 2004 ఫిబ్రవరి 6న విడుదలైన ఈ సినిమా అప్పట్లో తన విభిన్నమైన పోస్టర్లు, బోల్డ్ కథాంశంతో బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సాధించింది. ఇప్పుడు సరిగ్గా 22 ఏళ్ల తర్వాత పోచమ్మ ఫిల్మ్స్ సమర్పణలో అక్టోబర్ 29న రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను గ్రాండ్‌గా రీరిలీజ్ చేయనున్నట్లు నిర్మాతలు అధికారిక పోస్టర్ ద్వారా వెల్లడించారు.



## గాంధీ ఆరాధించిన రాముడు ధనికుల దేవుడా?

**ఖైరతాబాద్‌లో హిందూ ఓట్లను ఏకం చేసి బీజేపీని గెలిపిస్తాం.**

**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ .**

**జమ్మికుంట, మహా. :** గాంధీజీ సత్యం, అహింస, ధర్మం, శాంతి మార్గాలను పాటించారని, ఆయన ఆరాధించిన శ్రీరాముడు ధనికులకే దేవుడా? అని కాంగ్రెస్ నేతలను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ప్రశ్నించారు. గాంధీ జయంతి సందర్భంగా జమ్మికుంటలో మహాత్మా గాంధీ విగ్రహానికి శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గాంధీజీ ఆశయాలను ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని బండి సంజయ్ అన్నారు. గాంధీ వారసత్వం తమదేనని చెప్పుకునే నైతిక హక్కు కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు లేదని విమర్శించారు. గాంధీజీ సత్యం, ధర్మం, శాంతి, స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇచ్చారని, ఆ విలువలకు బీజేపీ కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ఓటమి తర్వాత ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని బండి సంజయ్ విమర్శించారు. గాంధీ, అంబేడ్కర్ వంటి జాతీయ నేతల జయంతి కార్యక్రమాలకు కేసీఆర్ దూరంగా ఉంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండింటిపైనా ప్రజల్లో వ్యతిరేకత ఉందని ఆయన అన్నారు. ఇవి బండి సంజయ్ చేసిన రాజకీయ వ్యాఖ్యలుగా ఆయన పేర్కొన్నారు. ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నికలో బీజేపీ విజయం సాధిస్తుందని బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి పోటీ చేసినా బీజేపీని ఓడించలేవని పేర్కొన్నారు. హిందూ ఓటర్లను ఏకం చేసి బీజేపీ అభ్యర్థిని గెలిపించేందుకు కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు.



# విజయ డెయిరీ విస్తరణకు శ్రీకారం

**రాజేంద్రనగర్, మహా:** విజయ డెయిరీ ఆధ్వర్యంలో చేపట్టిన నూతన ప్రాజెక్టులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తో కలిసి శుక్రవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. సుమారు రూ.27 కోట్లతో నిర్మించిన ఆటోమేటిక్ మెగా ఆయిల్ ప్యాకింగ్ ప్లాంట్‌ను ప్రారంభించారు. విజయ పర్ల్స్ మినరల్ వాటర్ ప్లాంట్‌తో పాటు రూ.2 కోట్లతో నిర్మించనున్న నూతన విక్రయ కేంద్రానికి శంకుస్థాపన చేశారు. విజయ బ్రాండ్‌పై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని మరింత పెంచేందుకు నాణ్యతలో రాజీ పడొద్దని మంత్రి తుమ్మల సూచించారు. విజయ డెయిరీని మరింత విస్తరించి భవిష్యత్‌లో రూ.10 లక్షల స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధికారులు, విజయ డెయిరీ సిబ్బంది పాల్గొన్నారు.



# పేదలకు సహాయం ముసుగులో పరిహారంలో అక్రమాలు

- అక్రమార్కులను కాపాడేందుకు పేదల పేరుతో పక్కదోవ పట్టించే ప్రయత్నం
- పేదలందరికీ పరిహారం మూడు నెలల క్రితమే అందింది
- అక్రమాలకు పాల్పడిన వారి బాగోతం బట్ట బయలు చేయడమే మీడియా ఉద్దేశం

**కారేపల్లి, మహా:** పేదలకు సహాయం చేస్తున్నామ నే ముసుగులో భారీ అక్రమాలకు పాల్పడ్డ అక్రమార్కులు విషయాన్ని తప్పుతోవ పట్టించే విధంగా వ్యవహరిస్తున్న తీరు కారేపల్లి మండలంలో చర్చనీయాంశమైంది. ప్రభుత్వ భూమిలో రేకుల షెడ్లకు ఇంటి పన్ను రసీదులు జారీ చేసిన విషయం లో తప్పు చేసిన కార్యదర్శి పై చర్యలు తీసుకోవడానికి జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతుండడంతో ఆ అధికారిని కాపాడటం కోసం పేదలను అడ్డం పెట్టుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. కారేపల్లి గ్రామానికి చెందిన రైల్వే డబుల్ లైన్ లో ఇళ్లు కోల్పోయిన పేదలందరికీ ప్రభుత్వం పరిహారం మూడు నెలల క్రితమే అందజేసింది. ఆ పరిహారంతో పేదలంతా కూడా అక్కడ ఇళ్లను ఖాళీ చేసేసి ప్రత్యామ్నాయంగా ప్లాట్లను కొనుక్కొని ఇల్లు నిర్మించుకునే పనుల్లో నిమగ్నం అయ్యారు. ఈ విషయాలు తెలిసి కూడా కొందరు పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తూ వ్యవహరించడం విచారకరం. కారేపల్లి రైల్వే భూ నిర్వాసితులకు మెరుగైన పరిహారం అందరికీ అందించాలని పత్రికలు అనేక కథనాలను గతంలో రాశాయి. పత్రికలు ప్రజల పక్షాన నిలుస్తాయి. కానీ పేదల ముసుగులో జరిగిన అక్రమాన్ని మాత్రం బట్టబయలు చేయడంలో ఎన్ని ఇబ్బందులు వచ్చినా ... పేదలను అడ్డం పెట్టుకొని బ్లాక్ మెయిల్ చేయాలనే ప్రయత్నాలు మానుకుంటే బాగుంటుందని పలువురు వారి అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు... ఇంటి పన్ను రసీదులు ఇవ్వడానికి ఎంత వసూలు చేశారు... పరిహారం వచ్చిన తర్వాత వారి వద్ద ఎంత డబ్బులు మింగారు అనే పూర్తి ఆధారాలు మీడియా వద్ద ఉన్నాయి కాబట్టి పత్రిక లు స్వేచ్ఛగా వార్తలు రాయగలుగుతున్నాయి. ఆ స్వేచ్ఛను హరించాలనే ప్రయత్నం ఏ మాత్రం మంచిది కాదు.. కారేపల్లి లో జరిగిన అక్రమంపై పత్రికల్లో వచ్చిన కథనాలు ఏ ఒక్క పేదవాడికి కూడా నష్టం తెచ్చేది కాదు... భవిష్యత్తులో కూడా వారికి ఎటువంటి నష్టం జరగదు కానీ వారి ముసుగులో అక్రమానికి పాల్పడిన వారిపై చర్యలు మాత్రం తప్పకుండా ఉంటాయి.. పేదలకు సహాయం చేయాలి కానీ ఆ సహాయం ముసుగులో జరిగిన అక్రమం ఏంటో తప్పులు చేసిన వారికి వారి అంతరాత్మలకు ఇప్పటికే అర్థమై ఉంటుంది... ఇంకా పేదలని పావులుగా వాడుకుంటూ పాపాలు చేయాలనే ఆలోచనలు ఏమాత్రం సరి కాదని పత్రికా స్వేచ్ఛను కాపాడేవారు వారి అభిప్రాయాలు వెల్లడిస్తున్నారు..

# ఫ్లై దుబాయ్ విమాన ఘటన పైలట్ స్మిత్ మచ్చర్‌తో మాట్లాడిన ప్రధాని మోదీ

**మహా** : ఫ్లై దుబాయ్ విమానంలో తీవ్ర ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొని, వందలాది మంది ప్రాణాలను కాపాడిన భారత సంతతి పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియో కాల్ లో మాట్లాడారు. క్లిష్ట సమయంలో స్మిత్ చూపిన ధైర్యసాహసాలను ప్రధాని మోదీ అభినందించారు. అబుదాబిలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్మిత్ మచ్చర్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులతోనూ ప్రధాని మాట్లాడి, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎవరి ప్రాణం పోవొద్దనే ప్రార్థించా స్మిత్ ప్రధాని నుంచి ఫోన్ కాల్ రావడంతో స్మిత్ భావోద్వేగానికి లోనయ్యారు. ప్రధాని అంటే తనకు అత్యంత గౌరవమని, ఆయన నుంచి కాల్ రావడం చాలా ప్రత్యేకంగా, గర్వంగా ఉందన్నారు. ఇది తాను కలలో కూడా ఊహించని క్షణమన్నారు. అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు తాను హనుమాన్ చాలీసాను పఠిస్తానన్నారు. కాక్‌పిట్ లో ఘర్షణ సమయంలోనూ ఆ మంత్రాన్నే జపించానని చెప్పారు. ఆ సమయంలో తాను గాయపడినా దాని గురించి ఆలోచించలేదని, ఎవరి ప్రాణాలు పోవొద్దనే ప్రార్థించానని ప్రధానికి స్మిత్ తెలిపారు. అంతకుముందు స్మిత్ కుటుంబసభ్యులతో ప్రధాని మోదీ మాట్లాడారు. ఆయనకు అన్ని విధాలా అండగా ఉంటామని, అవసరమైన సాయం అందిస్తామని ప్రధాని మోదీ స్మిత్ కుటుంబానికి హామీ ఇచ్చారు. స్మిత్ మచ్చర్ యూఏఈలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

# రేవంత్, కేటీఆర్ ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

**సంగారెడ్డి, మహా** : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. ఇద్దరూ తమ ఆస్తులపై విచారణకు సిద్ధంగా ఉంటే సోమవారం లోగా తెలంగాణ హైకోర్టుకు లేఖ రాయాలని ఆయన సవాల్ చేశారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంలో మీడియాతో మాట్లాడిన రఘునందన్‌రావు ఈ వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి, కేటీఆర్ ఇద్దరూ సోమవారం వరకు హైకోర్టుకు లేఖ రాయకపోతే తానే స్వయంగా లేఖ రాస్తానని రఘునందన్‌రావు ప్రకటించారు. అవసరమైతే ముగ్గురం కలిసి హైకోర్టు సిట్టింగ్ జడ్జిని కలిసి తమ ఆస్తులపై విచారణకు విజ్ఞప్తి చేద్దామని అన్నారు. తన ఆస్తులపైనా విచారణ జరిపించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు.

# భారత మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు మహోన్నతమైన వ్యక్తి..!

- తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు విస్మరించడంపై ఆక్షేపణ..!
- 14 భాషలు అనర్గళంగా మాట్లాడే ఏకైక వ్యక్తి..!
- తెలంగాణ ముద్దుబిడ్డగా ఆ ఘనత ఆయనకే దక్కింది..!
- దేశంలోని ఏదైనా అంతర్జాతీయ విమానాశ్రయానికి పి.వి. నరసింహారావు పేరు పెట్టాలి..!
- నిర్మలానంద అతీత సద్గురు మైలపల్లి రాజారావు డిమాండ్...!



మాజీ భారత ప్రధాని పీవీ నరసింహారావు





నిర్మలానంద అతీత సద్గురు మైలపల్లి రాజారావు

**కాప్రా, అక్టోబర్ 2 (మహా):** మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని కాప్రా ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ప్రియ శిష్యులు నిర్మలానంద అతీత సద్గురు మైలపల్లి రాజారావు మాట్లాడుతూ, భారత మాజీ ప్రధాని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా పనిచేసిన పాములపర్తి వెంకట నరసింహారావు దేశ రాజకీయ చరిత్రలో మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. దక్షిణ భారతదేశం నుంచి దేశ ప్రధానిగా బాధ్యతలు నిర్వహించి, భారత ఆర్థిక సంస్కరణలకు బలమైన పునాది వేసిన మహానేతగా పీవీ నరసింహారావు చిరస్మరణీయులని ఆయన పేర్కొన్నారు. పీవీ నరసింహారావు వంటి మహోన్నత నాయకుడికి దక్కాల్సిన స్థాయిలో గౌరవం లభించలేదని, తెలుగు రాష్ట్రాల్లోనూ ఆయన సేవలకు తగిన గుర్తింపు కల్పించడంలో నిర్లక్ష్యం జరిగిందని ఆయన ఆక్షేపించారు. దేశ అభివృద్ధికి విశేష కృషి చేసిన పీవీని రాజకీయాలకు అతీతంగా గౌరవించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. పీవీ నరసింహారావు 14 భాషలను అనర్గళంగా మాట్లాడగలిగిన అరుదైన బహుభాషా కోవిదుడని, సాహిత్యం, పరిపాలన, విదేశాంగం, ఆర్థిక రంగాలపై అసాధారణ పట్టు కలిగిన మేధావిగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. తెలంగాణ గడ్డపై జన్మించి దేశ అత్యున్నత పదవిని అధిరోహించిన తెలంగాణ ముద్దుబిడ్డగా ఆయన సాధించిన ఘనత అపూర్వమని పేర్కొన్నారు. పీవీ నరసింహారావు రచించిన "ది ఇన్‌సైడర్", "అయోధ్య 6 డిసెంబర్ 1992", "సహస్రఫణ్" (వేయిపడగల హిందీ అనువాదం) తదితర గ్రంథాలు ఆయనలోని సాహిత్యవేత్తను, మేధావిని ప్రపంచానికి పరిచయం చేశాయని రాజారావు తెలిపారు. రాజకీయ నాయకుడిగానే కాకుండా రచయితగా, భాషావేత్తగా, దూరదృష్టి కలిగిన ఆలోచనాపరుడిగా పీవీ విశిష్ట గుర్తింపు పొందారని పేర్కొన్నారు. పీవీ జీవితం, రచనలు, రాజకీయ ప్రస్థానం, దేశాభివృద్ధికి ఆయన చేసిన సేవలను భావితరాలకు చేరవేసే లక్ష్యంతో ఆయన పేరుతో ప్రత్యేక మ్యూజియంను ఏర్పాటు చేయాలని కోరారు. ఆ మ్యూజియంలో పీవీ రచనలు, అరుదైన పత్రాలు, ప్రసంగాలు, ఛాయాచిత్రాలు, వ్యక్తిగత వస్తువులు, చారిత్రక ఆధారాలను భద్రపరిచి యువతకు అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే దేశంలోని ఏదైనా అంతర్జాతీయ విమానాశ్రయానికి పి.వి. నరసింహారావు పేరు నామకరణం చేయాలని కోరారు. దక్షిణ భారతదేశపు అపర మేధావి, బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన పీవీ నరసింహారావుకు దేశవ్యాప్తంగా మరింత గౌరవప్రదమైన గుర్తింపు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్న ఆయన, ఈ అంశంపై త్వరలో కుటుంబ సభ్యులతో కలసి భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు.

# భారత్‌లో ధర్మం–దేశం వేర్వేరు కావు

- ప్రపంచ సమస్యలకు భారతీయ జ్ఞానమే మార్గదర్శకం.
- మోహన్ భగవత్

**న్యూఢిల్లీ, మహా :** భారతదేశంలో ధర్మం, దేశం పరస్పరం వేర్వేరు అంశాలు కాదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ స్పష్టం చేశారు. దేశానికి ధర్మమే ప్రాణాధారమని, ధర్మమే దేశాన్ని నిలబెట్టి సుస్థిరంగా ముందుకు నడిపిస్తుందని పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన అఖిల భారత విహార్ సేవా గ్రూప్ 14వ మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన భారతీయ ఆధ్యాత్మిక, తాత్విక జ్ఞాన సంపద ప్రాధాన్యాన్ని వివరించారు.

**ధర్మం–దేశం పరస్పర ఆధారితం**

మోహన్ భగవత్ మాట్లాడుతూ భారతీయ ఆలోచనా విధానంలో దేశం, ధర్మం విడదీయరాని అంశాలని పేర్కొన్నారు. ''మన దేశం, ధర్మం పరస్పర భిన్నమైనవి కావు. దేశానికి ధర్మమే ప్రాణాధారం. ధర్మమే దేశాన్ని సుస్థిరపరుస్తుంది. ఈ రెండూ ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయి'' అని ఆయన అన్నారు. భారతీయ జీవన విధానంలో ధర్మం అంటే కేవలం ఆచారాలు, పూజా విధానాలు మాత్రమే కాదని, వ్యక్తి, సమాజం, దేశం పట్ల బాధ్యతను కూడా కలిగి ఉంటుందని ఆయన ప్రసంగంలో వివరించారు.

**వైరుధ్యాలతో ప్రపంచం సతమతం**

ప్రస్తుతం ప్రపంచం అనేక రకాల వైరుధ్యాలతో సతమతమవుతోందని భగవత్ పేర్కొన్నారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత సాధించాల్సిన పరిస్థితి ఉందన్నారు. వ్యక్తిగత స్వేచ్ఛకు ప్రాధాన్యం ఇస్తూనే కుటుంబ వ్యవస్థను ఎలా కాపాడుకోవాలన్న ప్రశ్న ప్రపంచం ముందుందని తెలిపారు. మత విశ్వాసాలు, సామాజిక సంఘర్షణలు కూడా అనేక ప్రాంతాల్లో సవాళ్లుగా మారుతున్నాయని చెప్పారు.

**సమతుల్యత కోల్పోతున్న పరిస్థితులు**

ప్రపంచంలో ప్రస్తుతం అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయని భగవత్ వ్యాఖ్యానించారు. ఏ ఒక్క అంశంలోనూ సంపూర్ణ ఆనందం, సంపూర్ణ సమతుల్యత కనిపించడం లేదని అన్నారు. అతివాద ధోరణులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. అభివృద్ధి సాధిస్తున్నప్పటికీ మానవ జీవితంలో శాంతి, సామరస్యం, సమతుల్యతకు సంబంధించిన ప్రశ్నలు ఇంకా పరిష్కారం కాలేదని ఆయన అభిప్రాయపడ్డారు.

**భారత్ వైపు ప్రపంచం చూపు**

ప్రపంచం ఎదుర్కొంటున్న సంక్లిష్ట సమస్యలకు పరిష్కారం కోసం భారత్ వైపు చూస్తున్న పరిస్థితి ఉందని భగవత్ పేర్కొన్నారు. మానవ జీవితం, ప్రకృతి, సమాజం మధ్య సమతుల్యతను సాధించేందుకు భారతీయ ఆలోచనా విధానం మార్గదర్శకంగా నిలవగలదని ఆయన అన్నారు. ''ఈ సమస్యల నుంచి గట్టెక్కించే మార్గం భారత్ నుంచే వస్తుందని ప్రపంచ దేశాలకు తెలుసు'' అని పేర్కొన్నారు.

**భారతీయ జ్ఞాన సంపదకు ప్రాధాన్యం**

వేదాలు, ఉపనిషత్తులు, రామాయణం, మహాభారతం, భగవద్గీతతో పాటు జైన ఆగమాలు, త్రిపిటకాలు, గురు గ్రంథ్ సాహిబ్ వంటి విభిన్న జ్ఞాన సంప్రదాయాలు భారతదేశంలో ఉన్నాయని భగవత్ గుర్తుచేశారు. శతాబ్దాలుగా కొనసాగుతున్న ఈ జ్ఞాన సంపదలో మానవ జీవితం, సమాజం, ప్రకృతి, నైతికతకు సంబంధించిన అనేక ఆలోచనలు ఉన్నాయని తెలిపారు.

**జ్ఞాన సంప్రదాయాల పరిరక్షణ**

భారతీయ జ్ఞాన సంప్రదాయాలను కాపాడటం కేవలం ఒక మతానికి సంబంధించిన బాధ్యతగా చూడకూడదని భగవత్ అన్నారు. ఈ జ్ఞానాన్ని తరతరాలకు అందించడం ద్వారా మానవాళికి సేవ చేసినట్లవుతుందని పేర్కొన్నారు. భారతదేశంలో కొనసాగుతున్న వివిధ ఆధ్యాత్మిక, తాత్విక సంప్రదాయాల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు.

**మానవాళి భవిష్యత్తుతో ముడిపడి ఉంది**

భారతీయ జ్ఞానాన్ని, దాన్ని పుణికిపుచ్చుకున్న సంప్రదాయాలను కాపాడటం ద్వారా కేవలం ఒక వ్యక్తి లేదా ఒక వర్గం ప్రయోజనం పొందదని భగవత్ అన్నారు. ''మీరు కేవలం ఒకరి ప్రాణాన్ని కాపాడటం లేదు. మొత్తం మానవజాతి సురక్షిత భవిష్యత్తును రక్షిస్తున్నారు'' అని ఆయన ఉద్ఘాటించారు. భారతీయ జ్ఞాన సంపదను భవిష్యత్ తరాలకు అందించడం మానవాళి భవిష్యత్తుతో ముడిపడిన అంశమని ఆయన పేర్కొన్నారు.

**ప్రపంచానికి భారతీయ దృష్టికోణం**

మానవ జీవితంలోని విభిన్న అంశాలను పరస్పర సంబంధంతో చూసే భారతీయ దృష్టికోణానికి ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో ప్రాధాన్యం ఉందని భగవత్ తన ప్రసంగంలో వివరించారు. అభివృద్ధి, కుటుంబం, వ్యక్తి స్వేచ్ఛ, ప్రకృతి, ఆధ్యాత్మికత వంటి అంశాల మధ్య సమతుల్యత అవసరమని పేర్కొంటూ, భారతీయ జ్ఞాన సంప్రదాయాలను పరిరక్షించడం ద్వారా ప్రపంచానికి ఉపయోగపడే ఆలోచనలను ముందుకు తీసుకెళ్లవచ్చని అన్నారు.

# నన్ను ఆంధ్రా బిడ్డగా భావించండి

( మొదటి పేజీ తరువాయి )

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. తనను ఈ కార్యక్రమంలో భాగం చేసినందుకు సీఎం చంద్రబాబుకు రిలయన్స్ డైరెక్టర్ అనంత్ అంబానీ ధన్యవాదాలు తెలిపారు. ఈ చారిత్రక ఘట్టంలో తాను భాగస్వామి అయినందుకు హర్షం వ్యక్తం చేశారు. మదనపల్లెలో హైటెక్ అగ్రికల్చర్ విధానం కోసం ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ను ప్రారంభించినందుకు సంతోషంగా ఉంది. ఏపీ సీఎం చంద్రబాబు హైదరాబాద్ కు తీసుకొచ్చిన ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్వారా ఎంతో మంది పారిశ్రామికవేత్తలుగా ఎదిగారు. ప్రపంచంలోని అగ్ర సంస్థలకు సీఈఓలుగా అవకాశాలు దక్కించుకున్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో 'ఆంధ్ర భూమి.. సువర్ణ భూమి'గా మారుతోంది. రాష్ట్రానికి నేనేం చేయగలనో గైడ్ చేయాలని సీఎం చంద్రబాబును కోరారు. వికసిత్ భారత్ లక్ష్యాలు నెరవేరేందుకు తన వంతు కృషి చేసేందుకు సిద్ధంగా ఉన్నానని అనంత్ అంబానీ పేర్కొన్నారు. 1990లలో మదనపల్లెలో విశ్వగురు రవీంద్రనాథ్ ఠాగూర్ జాతీయ గీతాన్ని బెంగాలీ నుంచి ఇంగ్లీష్‌లోకి అనువదించారు. ఈరోజు మదనపల్లెలో ఎంతో మంది రైతులకు ప్రయోజనం కలిగించే గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. మహాత్మాగాంధీ కలలు కన్నట్లుగా రైతులు, గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయి. మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి చెప్పినట్లుగా జై జవాన్.. జై జవాన్ కిసాన్ నినాదంతో మరెన్నో విజయాలు సాధిద్దాం. దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి దీనికి మరో విషయం జై విజ్ఞాన్ చేర్చారు. నేడు ప్రధాని మోదీ జై అనుసంధాన్ అన్నారు. జై జవాన్.. జై కిసాన్.. జై విజ్ఞాన్.. జై అనుసంధాన్ గా మార్చేశారు. రైతులకు టెక్నాలజీ అవసరం ఉందని సీఎం చంద్రబాబు గుర్తించారు. అందువల్లే ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, టెక్నాలజీ సహాయంతో రైతుల వ్యవసాయంలో మరింత ప్రయోజనం చేకూరుతుంది. గ్రీన్ హౌస్ ఎనర్జీతో పర్యావరణానికి హాని కాకుండా అభివృద్ధి కోసం చంద్రబాబు కృషి చేస్తున్నారు. అందుకే రిలయన్స్ సంస్థ తమకు బయో ప్లాంట్స్, సహా ఇతర పెట్టుబడి అవకాశాలు కల్పించినందుకు ఏపీ ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. భారత్ గ్రామీణ ప్రాంతాల్లోనే జీవిస్తుందని గాంధీజి సర్వోదయ అంత్యోదయ అని పిలుపునిచ్చారు. టెక్నాలజీతో రైతుల ఆదాయం పెరగాలని సీఎం చంద్రబాబు ఈ మిషన్ చేపట్టారు. రైతులు వేసే పంటలకు చీడపీడలు సోకకుండా ఏఐ, డ్రోన్లు రోబోటిక్స్ సాంకేతికతతో ప్రెసిషన్ ఫార్మింగ్ చేయడానికి ఐఎస్ఏ సహకరిస్తుంది. నీరు, ఎరువులను పంటలకు అందించేలా సహకారం అందిస్తాం. ఏఐ ద్వారా సంప్రదాయ ఇంటెలిజెన్స్ జోడించి రైతులకు సహకారం అందించేలా చేస్తాం. రిలయన్స్ గ్రీన్ బిజినెస్ ద్వారా అన్నదాతలను ఉర్జాదాతలుగా మారుస్తాం. రిలయన్స్ సీబీజీ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులు పెడుతోంది. మదనపల్లె టమాటో రైతులకు ఎప్పుడు ఎక్కడ తమ ఉత్పత్తులు విక్రయించాలో చెబుతాం. మా తాత ధీరుబాయ్ అంబానీ కలలను సాకారం చేయడానికి కృషి చేస్తున్నాం. ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ తో కలిసి జియో పని చేస్తుంది. రైతుల ఇంటి వరకు వెళ్లి సహకారం అందించేలా మేం పని చేస్తామన్నారు. ఏపీ ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పెద్ద ఎత్తున పెట్టుబడులు సాధిస్తోంది. 388 మెగా ఇన్వెస్ట్మెంట్స్ రాష్ట్రానికి వచ్చాయి. 14 లక్షల కోట్లు, 11 లక్షల మందికి ఉద్యోగాలు ఏపీ ప్రభుత్వం సాధించింది. రాయలసీమలో హార్టికల్చర్ హబ్ కు రిలయన్స్ సహకారం అందిస్తుంది. వంతారా ద్వారా పశువులకు, జంతువులకు సేవలు అందిస్తున్నాం. పశుసంవర్ధకం, వ్యవసాయం, ఉద్యాన రంగాల అభివృద్ధికి పని చేస్తామని అనంత్ అంబానీ పేర్కొన్నారు.

**ఫ్రూట్ బౌల్‌గా రాయలసీమ**

**నీళ్లుంటే రైతులు బంగారం పండిస్తారు : సీఎం చంద్రబాబు**

కరవు ప్రాంతం రాయలసీమ దశదిశను సమూలంగా మార్చేందుకు గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాయలసీమను ఫ్రూట్ బౌల్ గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ప్రాథమిక రంగం వృద్ధిలో హార్టికల్చర్‌ది కీలక పాత్ర అని, రాబోయే రోజుల్లో మరో 6 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలను విస్తరించి రాయలసీమ ప్రాంతాన్ని ఫ్రూట్ బౌల్ గా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. రాయలసీమ రైతుల శ్రమను కొనియాడిన సీఎం సరిపడా సాగునీరు అందిస్తే ఈ నేలలో బంగారం పండించే సత్తా ఇక్కడి రైతులకు ఉందన్నారు. 20 రకాల పంటల్లో ఏ పంటనైనా పండించగల ప్రతిభ ఈ ప్రాంత రైతుల సొంతమని, ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే సంపద సృష్టిస్తారని కితాబిచ్చారు. ఈ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ద్వారా పంటల సాగుతో పాటు ధరల స్థిరీకరణ సాధ్యమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఎన్టీఆర్ హయాంలో ప్రారంభమైన సాగునీటి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తున్నామని.. హంద్రీనీవా ప్రాజెక్ట్ నీళ్లు రాకపోతే మదనపల్లె నుంచి పెద్ద ఎత్తున వలసలు ఉండేవన్నారు. రాయలసీమను కరవు నుంచి కాపాడేందుకు డ్రిప్ ఇరిగేషన్, వాటర్ షెడ్ పథకాలు, పంటకుంటల ద్వారా జలసంరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులను వచ్చే మూడేళ్లలో పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే హంద్రీనీవా ఫేజ్ 2, వెలిగొండ ఫేజ్ 2, మడకశిర బ్రాంచ్ కెనాల్ విస్తరణ ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీపై ఏపీ సీఎం చంద్రబాబు ప్రశంసల వర్షం కురిపించారు. అనంత్ అంబానీ కేవలం ఒక విజన్ ఉన్న యువ పారిశ్రామికవేత్త మాత్రమే కాదని, గొప్ప పర్యావరణ పరిరక్షకుడని కొనియాడారు. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఏకంగా 3,500 ఎకరాలలో వంతార పేరుతో జంతువుల పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి మూగజీవులను సంరక్షిస్తున్నారని పేర్కొన్నారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిపై ఉన్న అపారమైన భక్తిశ్రద్ధలతో పర్యావరణహితం కోసం ఇటీవల తిరుమలకు ఉచితంగా ఎలక్ట్రిక్ బస్సులను అందజేశారని సీఎం చంద్రబాబు గుర్తుచేసుకున్నారు.



# ఐస్‌క్రీమ్‌లో పురుగు ..వినియోగదారుల ఆందోళన!?

**పెద్దపల్లి మహా :** జిల్లా లోని ఉన్న ఓ ఐస్‌క్రీమ్ పార్లర్‌లో ఐస్‌క్రీమ్‌లో జెర్రి (పురుగు) కనిపించడం కలకలం రేపింది. ఐస్‌క్రీమ్ తింటుండగా పురుగు కనిపించడంతో వినియోగదారులు ఆందోళనకు గురయ్యారు. ఘటనపై సంబంధిత ఆహార భద్రత అధికారులు స్పందించి పార్లర్‌లో తనిఖీలు నిర్వహించి, ఆహార నాణ్యత మరియు పరిశుభ్రత ప్రమాబణాలను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.

# గంజాయి బానిసత్వం నుంచి విముక్తి..

**పెద్దపల్లి మహా :** భీమారం: గంజాయికి బానిసై కుటుంబ జీవితానికి దూరమైన బీహార్‌కు చెందిన ఓ వలస కూలీకి భీమారం పోలీసులు అండగా నిలిచి డీఅడిక్షన్ చికిత్స అందించడంతో, ప్రస్తుతం గంజాయి అలవాటును మానుకుని కుటుంబంతో సంతోషంగా జీవిస్తున్నాడు. ఉపాధి కోసం తెలంగాణకు వచ్చిన సదరు వ్యక్తి భీమారం పోలీస్ స్టేషన్ పరిధిలో కూలీగా పనిచేస్తూ గంజాయికి బానిసైన విషయాన్ని గుర్తించిన ఎస్ఐ రాజేందర్, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అతడికి అవసరమైన సహాయం అందించారు. మంచిర్యాల జోన్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న డీఅడిక్షన్ సెంటర్‌కు తరలించి, నిపుణుల పర్యవేక్షణలో చికిత్స అందేలా చర్యలు చేపట్టారు. చికిత్స అనంతరం గంజాయి అలవాటును పూర్తిగా మానుకున్న సదరు వ్యక్తి తిరిగి కుటుంబంతో ఆనందంగా జీవిస్తున్నాడు. తన జీవితంలో వచ్చిన మార్పుకు పోలీసుల సహకారమే కారణమని పేర్కొంటూ భీమారం పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఎస్ఐ రాజేందర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపాడు. పోలీసుల సహాయానికి గుర్తుగా స్వీట్లు అందజేశాడు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజేందర్ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు బానిసైన వారిని నేరస్తులుగా మాత్రమే చూడకుండా, వారి జీవితాలను తిరిగి సాధారణ స్థితికి తీసుకురావడానికి అవసరమైన సహాయం అందించడం పోలీసుల సామాజిక బాధ్యతలో భాగమన్నారు. మత్తు పదార్థాల బారిన పడిన వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి డీఅడిక్షన్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. "మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి.. కుటుంబంతో ఆనందంగా జీవించండి. అవసరమైన వారికి పోలీసుల సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది" అని ఎస్ఐ రాజేందర్ తెలిపారు.



# స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుడు బాపూజీ

**వరంగల్, రంగసాయిపేట మహా;** మాహాత్మ గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం వరంగల్ నగరం రంగసాయిపేట లోని మహాత్మా గాంధీ విగ్రహానికి కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్ పర్సన్ గుండు సుధారాణి మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, డిసిసి అధ్యక్షులు మొహమ్మద్ అయుబ్, మాజీ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ లతో కలిసి మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేసినారు. ఈ సందర్భంగా గుండు సుధారాణి మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్రంలో మహాత్మా గాంధీ కీలక భూమిక పోషించారని, స్వాతంత్రోద్యమంలో వారు చేసిన పోరాటం మరువలేనిదని, నేటి తరం యువకులంతా వారి ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని కోరారు. ఎమ్మెల్సీ సారయ్య మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో మహాత్మా గాంధీ శాంతియుత పోరాటం సాగించారని అన్నారు. ఈ కార్యక్రమంలో మేర కార్పొరేషన్ చైర్మన్ సంగ వెంకట్రాజం, మాజీ కార్పొరేటర్లు గుండేటి నరేంద్ర కుమార్, బస్వరాజు శిరీష శ్రీమన్, ఆకుతోట తేజస్విని శిరీష్, బిల్ల కవిత శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్గొండ రమేష్, గోరంట్ల రాజు, కొత్తపెల్లి శ్రీనివాస్, ఓగిలిశెట్టి అనిల్ కుమార్, వరంగల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు నారగోని స్వప్న మురళి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కురవి పరమేష్, సోషల్ మీడియా కన్వీనర్ సోమలక్ష్మి, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## విటమిన్ డి ఎక్కువైతే ప్రమాదమే..

# కిడ్నీలపై తీవ్ర ప్రభావం!

శరీరానికి అవసరమైన ముఖ్యమైన పోషకాలలో విటమిన్ డి ఒకటి. ఎముకల బలానికి మాత్రమే కాకుండా కండరాలు, నాడీ వ్యవస్థ, కాల్షియం శోషణ, రోగనిరోధక వ్యవస్థ వంటి అనేక శారీరక ప్రక్రియల్లో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. సూర్యరశ్మి, కొన్ని ఆహార పదార్థాలు, వైద్యుల సూచనతో తీసుకునే సప్లిమెంట్ల ద్వారా విటమిన్ డి అందుతుంది. అయితే అవసరమైనంత మాత్రమే ఉపయోగపడే ఈ విటమిన్‌ను మోతాదుకు మించి తీసుకుంటే మాత్రం సమస్యలు మొదలవుతాయి. ముఖ్యంగా అధిక మోతాదులో సప్లిమెంట్లను దీర్ఘకాలం తీసుకోవడం వల్ల రక్తంలో కాల్షియం స్థాయి పెరిగే ప్రమాదం ఉంటుంది. దీన్నే హైపర్‌కాల్సిమియా అంటారు.

**విటమిన్ డి ఎందుకు అవసరం?**

మన శరీరం ఆహారం ద్వారా తీసుకునే కాల్షియంను సమర్థంగా గ్రహించడానికి విటమిన్ డి సహాయపడుతుంది. అందుకే ఎముకలు, దంతాల ఆరోగ్యానికి ఇది అవసరం. కండరాల పనితీరు, నాడీ వ్యవస్థ పనితీరు వంటి అంశాల్లోనూ విటమిన్ డి పాత్ర ఉంది. శరీరంలో లోపం ఉన్నప్పుడు వైద్యులు రక్తపరీక్షల ఆధారంగా సప్లిమెంట్లు సూచించవచ్చు.అయితే విటమిన్ డి లోపం ఉందేమోనని అనుమానంతో స్వయంగా అధిక మోతాదులో క్యాప్సూల్స్ లేదా సాచెట్లు తీసుకోవడం సరికాదు. ముఖ్యంగా అధిక మోతాదులో ఉండే సప్లిమెంట్లను పదేపదే ఉపయోగిస్తే శరీరంలో విటమిన్ డి పేరుకుపోయి కాల్షియం స్థాయిని పెంచవచ్చు. సాధారణంగా విటమిన్ డి విషపూరితం కావడానికి ప్రధాన కారణం సప్లిమెంట్లను అధికంగా తీసుకోవడమేనని నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ పేర్కొంటోంది.



**అధికమైతే కనిపించే లక్షణాలు**

విటమిన్ డి ఎక్కువైనప్పుడు వచ్చే సమస్యలు ఒక్కసారిగా అందరికీ ఒకే విధంగా కనిపించకపోవచ్చు. రక్తంలో కాల్షియం పెరగడం వల్ల వికారం, వాంతులు, ఆకలి తగ్గడం, మలబద్ధకం, నీరసం, కండరాల బలహీనత వంటి లక్షణాలు కనిపించవచ్చు. కొందరికి సాధారణం కంటే ఎక్కువ దాహం వేయడం, తరచుగా మూత్రం రావడం, డీహైడ్రేషన్ వంటి సమస్యలు కూడా ఎదురవుతాయి. తీవ్రమైన సందర్భాల్లో గందరగోళం లేదా ఇతర నాడీ సంబంధిత లక్షణాలు రావచ్చు. ఇక్కడ మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే.. ఈ లక్షణాలను కేవలం విటమిన్ డి సమస్యగా భావించి ఇంట్లోనే చికిత్స చేసుకోవడం ప్రమాదకరం. ఇలాంటి లక్షణాలకు ఇతర అనేక కారణాలు కూడా ఉండవచ్చు. విటమిన్ డి సప్లిమెంట్లు తీసుకుంటున్న వ్యక్తికి ఈ లక్షణాలు కనిపిస్తే వైద్యుడిని సంప్రదించి అవసరమైన రక్తపరీక్షలు చేయించుకోవడం మంచిది.

కిడ్నీలపై ఎందుకు ప్రభావం?

రక్తంలో కాల్షియం అధికంగా ఉండటం వల్ల కిడ్నీలపై అదనపు భారం పడుతుంది. అధిక కాల్షియం మూత్ర పిండాల్లో రాళ్లు ఏర్పడటానికి కారణం కావచ్చు. పరిస్థితి తీవ్రమైతే కిడ్నీల పనితీరు దెబ్బతినే అవకాశం ఉంది. NIH సమాచారం ప్రకారం విటమిన్ డి విషపూరిత స్థాయి తీవ్రమైన సందర్భాల్లో కిడ్నీ వైఫల్యం వరకు దారితీయవచ్చు.

కేవలం కిడ్నీలకే ప్రమాదం పరిమితం కాదు. దీర్ఘకాలంగా అధిక కాల్షియం ఉండటం వల్ల శరీరంలోని కొన్ని కణజాలాల్లో కాల్షియం పేరుకుపోయే అవకాశం ఉంది. తీవ్రమైన విటమిన్ డి టాక్సిసిటీ సందర్భాల్లో గుండె స్పందనలో అసాధారణతలు కూడా నమోదయ్యాయి. అందుకే సప్లిమెంట్లను 'విటమిన్ కాబట్టి ఎంత తీసుకున్నా మంచిదే' అనే భావనతో ఉపయోగించకూడదు.

**రోజుకు ఎంత అవసరం?**

విటమిన్ డి అవసరం వయసు, ఆరోగ్య పరిస్థితి, ఆహారం, సూర్యరశ్మి, వైద్య పరిస్థితులు వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. పెద్దలకు సాధారణంగా రోజువారీ గరిష్ఠ పరిమితి 4,000 IUగా NIH పేర్కొంటోంది. అయితే ఇది సాధారణ జనాభాకు సంబంధించిన పై పరిమితి మాత్రమే; విటమిన్ డి లోపం వంటి నిర్దిష్ట వైద్య పరిస్థితుల్లో వైద్యుల పర్యవేక్షణలో తాత్కాలికంగా అధిక మోతాదులు సూచించవచ్చు. కాబట్టి డాక్టర్ సూచించిన చికిత్సా మోతాదును సాధారణంగా అందరికీ వర్తించే మోతాదుతో పోల్చకూడదు. రక్తంలో 25hydroxy vitamin D పరీక్ష ద్వారా శరీరంలో విటమిన్ డి స్థాయిని అంచనా వేయవచ్చు. అయితే ఒకే సంఖ్య ఆధారంగా ప్రతి వ్యక్తికి ఒకే చికిత్స నిర్ణయించడం సరైంది కాదు. వ్యక్తి ఆరోగ్య పరిస్థితి, ఇతర రక్తపరీక్షలు, తీసుకుంటున్న మందులు, సప్లిమెంట్ మోతాదు వంటి అంశాలను వైద్యుడు పరిగణనలోకి తీసుకుంటారు.అందుకే విటమిన్ డి విషయంలో గుర్తుంచుకోవాల్సిన ప్రధాన విషయం ఒక్కటే.. లోపం ఎంత సమస్యో, అధిక మోతాదు కూడా అంతే సమస్య కావచ్చు. పరీక్షలు లేకుండా సొంతంగా అధిక మోతాదు సప్లిమెంట్లు వాడటం కంటే, అవసరాన్ని గుర్తించి వైద్యుల సూచనతో సరైన మోతాదులో తీసుకోవడం సురక్షితమైన విధానం.

# న్యూఢిల్లీ ప్రకటన తర్వాత బ్రిక్స్ పాత్ర మారుతుందా?




ప్రధానఅభివృద్ధిచెందుతున్నఆర్థికవ్యవస్థల మధ్య బహుపాక్షికఆర్థిక, సాంకేతిక మరియు భౌగోళిక రాజకీయ సహకారాన్నిపెంపొందించడానికి రూపొందించబడిన అంతర ప్రభుత్వసంస్థ బ్రిక్స్. ప్రపంచఆర్థిక, రాజకీయపాలననుసంస్కరించడం, బహుళ ధృవ ప్రపంచక్రమాన్ని ప్రోత్సహించడం, స్థానిక కరెన్సీలలోవాణిజాన్నిమెరుగుపరచడం, గ్లోబల్ ఔత్సాహిక సమిష్టి గొంతును బలోపేతం చేయడం దీని ప్రధానలక్ష్యాలు. బ్రెజిల్, రష్యా, భారతదేశం, చైనా, దక్షిణాఫ్రికాదీనిప్రధాన సభ్య దేశాలుగా ఉండగా, ఆతర్వాత ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీఅరేబియా, యునైటెడ్అరబ్ఎమిరేట్స్, ఇండోనేషియా సభ్యదేశాలుగా చేరాయి. అదనంగా, ఈ కూటమి అధికారిక భాగస్వామ్య దేశనమూనాను ఏకీకృతం చేసింది, దీనిద్వారా బెలారస్, బొలీవియా, క్యూబా, కజకిస్తాన్, మలేషియా, నైజీరియా, థాయిలాండ్, ఉగాండా, ఉజ్బెకిస్తాన్, వియత్నాం వంటి దేశాలను దాని విస్తృత అభివృద్ధి ఆర్థిక కార్యక్రమాలలో నిశితంగా సహకరించాల్సిందిగా ఆహ్వానించింది. విస్తరించిన బ్రిక్స్ కూటమిప్రపంచజిడిపిలోదాదాపు 40% మరియు ప్రపంచజనాభాలో 45% కంటే ఎక్కువ ప్రాతినిధ్యం వహిస్తూ, ప్రభావవంతమైన ఆర్థికశక్తిగా ఎదిగింది. ప్రపంచసరుకుల ఎగుమతుల్లో సుమారు 22% (5.6 ట్రిలియన్ల డార్లకుపైగా) వాటాతో, తయారీ, వ్యవసాయం, సాంకేతికత, ఇంధనరంగాల్లో కోట్లాది ఉపాధి అవకాశాలకు మద్దతు ఇస్తోంది. కస్టమ్స్ సహకారం, సరిహద్దు సరఫరా గొలుసు లసులభతరం వంటి చర్యలు అంతర్గత వాణిజ్యాన్నిపెంచుతున్నాయి. స్థానికకరెన్సీలవినియోగం, వ్యూహాత్మక మౌలిక సదుపాయాలపెట్టుబడులు, న్యూడెవలప్ మెంట్ ట్యాక్స్ ద్వారా ఆర్థిక సహకారం సభ్యదేశాల అనుసంధానాన్ని బలోపేతంచేస్తున్నాయి.

**నూతన ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు దిక్సూచి**

సభ్య దేశాల మధ్య భౌగోళిక రాజకీయ విభేదాలను పూడ్చేందుకు భారతదేశం నేతృత్వంలో జరిగిన చర్చల అనంతరం, 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో 140 అంశాలతో కూడిన న్యూఢిల్లీ ప్రకటన ఏకగ్రీవంగా ఆమోదించబడింది. స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారంపై దృష్టిసారించిన ఈ ప్రకటన, ఉగ్రవాదంలోని అన్ని రూపాలపై శూన్యసహన (జీరోటాలరెన్స్) వైఖరిని ప్రకటిస్తూ, సరిహద్దు ఉగ్రవాద నెట్‌వర్క్‌ను మరియు పహల్గాం దాడిని తీవ్రంగా ఖండించింది. పశ్చిమాసియా సంఘర్షణల్లో సంయమనం, శాంతి, మానవతా సహాయాన్ని కోరింది. సుస్థిర అభివృద్ధి, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ భాగస్వామ్యం, విశ్వసనీయ కృత్రిమ మేధస్సు కోసం సమాన ఫ్రేమ్‌వర్క్‌లను ప్రోత్సహిస్తూ బహుళధ్రువ ప్రపంచ దృక్పథాన్ని ఇది బలోపేతం చేసింది. కొత్త ఢిల్లీ ప్రకటన ఏకపక్ష సుంకాలు మరియు సుంకేతర చర్యలు ప్రపంచ వాణిజ్యాన్ని వక్రీకరిస్తాయని, ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలను ఉల్లంఘించే ప్రమాదం ఉందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పర్యావరణ విధానాల పేరుతో విధించే వివక్షాత్మక వాణిజ్య అడ్డంకులను, ముఖ్యంగా ఐరోపా సమాఖ్యకు చెందిన కార్బన్ బోర్డర్ అడ్జస్ట్మెంట్ మెకానిజం ను వ్యతిరేకించింది. బహుపాక్షిక వాణిజ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు రెండు అంచెల ప్రపంచ వాణిజ్య సంస్థ వివాద పరిష్కార వ్యవస్థను పునరుద్ధరించి, అప్పిలేట్ బాడీ సభ్యులను నియమించాలని కోరింది. ఏకైక బ్రిక్స్ కరెన్సీకి బదులుగా, స్థానిక కరెన్సీలతో సరిహద్దు వాణిజ్యం మరియు పెట్టుబడులను విస్తరించాలని ప్రోత్సహించింది.

**ఐక్యరాజ్యసమితి సంస్కరణల ప్రభావం**

కొత్త ఢిల్లీ ప్రకటన ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిను మరింత ప్రాతినిధ్య, ప్రజాస్వామ్య, జవాబుదారీతనంతో మార్చేందుకు సమగ్ర సంస్కరణలను కోరింది. ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికాలతో కూడిన గ్లోబల్ సౌత్‌కు శాశ్వత ప్రాతినిధ్యం, బలమైన స్వరం కల్పించాలని పేర్కొంది. అంతర్జాతీయ ఉన్నత పదవుల ఎంపికలో పారదర్శకత, సమ్మిళితత్వాన్ని సమర్థిస్తూ, ఇప్పటివరకు మహిళ ఎవరూ ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ కాలేదని గుర్తుచేసింది. తదుపరి వారసత్వ ప్రక్రియలో అభివృద్ధి చెందుతున్న దేశాల మహిళా నాయకత్వానికి ప్రాతినిధ్యం పెరగాలని కోరింది. అలాగే, ఐక్యరాజ్యసమితి చార్టర్‌కు వెలుపల విధించే ఆర్థిక, ద్వితీయ ఆంక్షలను అంతర్జాతీయ చట్టానికి, మానవ హక్కులకు, అభివృద్ధికి హానికరమైనవిగా ఖండించింది.

**కొత్త అభివృద్ధి బ్యాంకు పాత్ర**

2015లో వర్ధమాన ఆర్థిక వ్యవస్థలు స్థాపించిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ , గ్లోబల్ సౌత్‌లో సుస్థిర మౌలిక సదుపాయాలు మరియు అభివృద్ధి ప్రాజెక్టులకు నిధులు సమకూర్చేందుకు 100 బిలియన్ డాలర్ల అధికారిక మూలధనంతో పనిచేస్తోంది. పశ్చిమ దేశాల ద్రవ్య ఆధారపడటాన్ని తగ్గించేందుకు బ్రిక్స్ డీడాలరైజేషన్కు ప్రాధాన్యతనిస్తూ, జాతీయ కరెన్సీలలో వాణిజ్యం మరియు ప్రత్యామ్నాయ వ్యవస్థలను ప్రోత్సహిస్తోంది. సభ్య దేశాలకు స్వల్పకాలిక చెల్లింపుల సమతుల్యత ఒత్తిళ్లలో 100 బిలియన్ డాలర్ల వరకు ద్రవ్య భద్రత కల్పించే కంటింజెట్ రిజర్వ్ అరేంజ్మెంట్ ఈ వ్యవస్థను బలోపేతం చేస్తుంది. సరిహద్దు చెల్లింపులను సులభతరం చేయడం, లావాదేవీ ఖర్చులను తగ్గించడం, ఇంధనం, డిజిటల్ మౌలిక సదుపాయాలు, వ్యవసాయ రంగాల్లో వాణిజ్యాన్ని పెంచడం ప్రధాన లక్ష్యాలు.

**ఉమ్మడి కరెన్సీ**

గత బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాల్లో ఉమ్మడి కరెన్సీపై చర్చలు జరిగినప్పటికీ, విభిన్న ఆర్థిక పరిస్థితుల కారణంగా ప్రస్తుతానికి అలాంటి కరెన్సీ అధికారిక పరిశీలనలో లేదని న్యూఢిల్లీ ప్రకటన స్పష్టం చేసింది. బదులుగా, స్థానిక కరెన్సీలలో ద్వైపాక్షిక వాణిజ్యం మరియు దేశీయ డిజిటల్ చెల్లింపు వ్యవస్థల అనుసంధానంపై దృష్టిపెట్టింది. ప్రత్యేక రూపాయి వోస్ట్రో ఖాతాలు, ప్రత్యామ్నాయ సరిహద్దు చెల్లింపు వేదికలు విదేశీ మారకద్రవ్య ఖర్చులు, ఆంక్షల ప్రభావాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. విస్తరించిన బ్రిక్స్ ప్రపంచ జనాభాలో సుమారు 49.5%, పీపీపీ ఆధారిత ప్రపంచ జీడీపీలో 40%, ప్రపంచ వాణిజ్యంలో 26%కు పైగా వాటాను కలిగి ఉంది.

**సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై తీర్మానం**

కొత్త ఢిల్లీ ప్రకటన పేదరిక నిర్మూలన, ఆకలి నివారణ, సమ్మిళిత వృద్ధి, 2030 సుస్థిర అభివృద్ధి ఎజెండాకు ప్రాధాన్యత ఇస్తుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు శిలాజ ఇంధనాల ప్రాధాన్యతను గుర్తిస్తూ, న్యాయమైన, క్రమబద్ధమైన ఇంధన పరివర్తనను ప్రోత్సహిస్తుంది. ఏకపక్ష కార్బన్ సరిహద్దు సర్దుబాటు యంత్రాలను అన్యాయ వాణిజ్య అడ్డంకులుగా వ్యతిరేకించింది. బ్రిక్స్ కార్బన్ మార్కెట్స్ పార్ట్‌నర్‌షిప్, అటవీ సంరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణకు మద్దతిచ్చింది. బ్రిక్స్ అగ్రిన్ ద్వారా వాతావరణఅనుకూల పునరుత్పత్తి వ్యవసాయం మరియు ఆహార భద్రతను ప్రోత్సహిస్తోంది. 2026 సెప్టెంబరు 12-13 తేదీల బ్రిక్స్ న్యూఢిల్లీ శిఖరాగ్ర సమావేశంలో ఆమోదించిన కృత్రిమ మేధస్సు విధానం, కూటమి ఆర్థిక, శాస్త్రీయ, సాంకేతిక సహకారంలో దీనిని కేంద్రంగా నిలిపింది. కృత్రిమ మేధస్సు గ్లోబల్ గవర్నెన్స్‌పై బ్రిక్స్ నాయకుల ప్రకటనను అమలు చేయడానికి సభ్య దేశాలు కట్టుబడ్డాయి. గ్లోబల్ సౌత్‌కు దీని వనరులు, సాధనాలకు విస్తృత ప్రాప్యత, సురక్షితమైన, సమ్మిళిత, విశ్వసనీయ సాంకేతికతలకు ప్రాధాన్యత ఇచ్చింది. డీప్‌ఫేక్‌లు, తప్పుడు సమాచారం, సైబర్ దుర్వినియోగాన్ని ఎదుర్కొంటూ, శాస్త్రీయ ఆవిష్కరణలు, హరిత పరివర్తన, సుస్థిర అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది.

**ప్రస్తుత వ్యూహం**

ప్రస్తుత భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, రక్షణవాద సుంకాలు, ఆర్థిక ఆంక్షలను ఎదుర్కొనేందుకు బ్రిక్స్ ఆర్థిక స్వయంప్రతిపత్తి, వ్యూహాత్మక సహకారాన్ని బలోపేతం చేయాలి. స్థానిక కరెన్సీ చెల్లింపులు, సురక్షిత సరిహద్దు చెల్లింపు వేదికలను వేగవంతం చేయాలి. గ్లోబల్ సౌత్‌కు అభివృద్ధి నిధుల కోసం కొత్త అభివృద్ధి బ్యాంకు రుణ సామర్థ్యాన్ని పెంచాలి. ప్రపంచ వాణిజ్య సంస్థలో సమగ్ర సంస్కరణలు, బలమైన వివాద పరిష్కార వ్యవస్థ కోసం సమష్టిగా కృషి చేయాలి. దేశీయ హరిత సాంకేతికత, ఉమ్మడి కార్బన్ మార్కెట్ల ద్వారా ఏకపక్ష వాణిజ్య అడ్డంకులను ఎదుర్కోవాలి. వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి, దౌత్య తటస్థతతో ప్రపంచ శక్తులతో నిర్మాణాత్మక సంబంధాలు కొనసాగించాలి.

**కిరణ్ శ్రీ, ఫ్రీలాన్స్ రచయిత, తిరుపతి,**
**8125695799**

# స్ట్రోక్ తర్వాత మెదడు కోలుకోవాలంటే..

# ఆహారంలో ఇవి తప్పనిసరి





స్ట్రోక్ అనేది మెదడులోని కొంత భాగానికి రక్తప్రసరణకు అంతరాయం కలిగినప్పుడు ఏర్పడే అత్యవసర పరిస్థితి. స్ట్రోక్ వచ్చిన వెంటనే వైద్య చికిత్స ఎంత ముఖ్యమో.. ఆ తర్వాతి రికవరీ సమయంలో తీసుకునే ఆహారం, పునరావాస చికిత్స, మందులు, నిద్ర, రోజువారీ జీవనశైలి కూడా అంతే కీలకం. అయితే స్ట్రోక్ తర్వాత దెబ్బతిన్న మెదడును ఒక్క ఆహారం లేదా ఒకే ఒక్క 'సూపర్‌ఫుడ్' వెంటనే బాగు చేస్తుందనుకోవడం సరికాదు. శరీరానికి అవసరమైన పోషకాలు అందేలా సమతుల్యమైన ఆహారం తీసుకోవడం రికవరీకి సహాయకంగా ఉంటుంది. అమెరికన్ స్ట్రోక్ అసోసియేషన్ కూడా స్ట్రోక్ తర్వాత ఆరోగ్యకరమైన ఆహారం రికవరీకి తోడ్పడుతుందని సూచిస్తోంది.

**పండ్లు, కూరగాయలతో పోషకాలు**

స్ట్రోక్ తర్వాత రోజువారీ ఆహారంలో తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లకు ప్రాధాన్యం ఇవ్వాలి. వీటిలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు, పీచు వంటి పోషకాలు లభిస్తాయి. ఒకే రకమైన పండ్లు లేదా కూరగాయలపై ఆధారపడకుండా రంగురంగుల కూరగాయలు, వివిధ రకాల పండ్లను ఆహారంలో మార్చి మార్చి తీసుకోవడం మంచిది. పండ్లను జ్యూస్‌గా కాకుండా వీలైనంత వరకు సహజ రూపంలో తీసుకోవడం ద్వారా పీచు కూడా లభిస్తుంది.

మొత్తం ధాన్యాలు, పప్పులు, శనగలు, పెసలు, కందులు వంటి పప్పుధాన్యాలు కూడా మంచి ఎంపికలు. ఓట్స్, బ్రౌన్ రైస్, సంపూర్ణ గోధుమలు వంటి తృణధాన్యాలను ఆహారంలో చేర్చవచ్చు. ఇవి పీచును అందించడంతో పాటు పొట్ట నిండిన భావన కలిగిస్తాయి. ఆరోగ్యకరమైన ఆహారంలో పండ్లు, కూరగాయలు, సంపూర్ణ ధాన్యాలు, పప్పుధాన్యాలు, ఆరోగ్యకరమైన ప్రొటీన్ వనరులకు ప్రాధాన్యం ఇవ్వాలని స్ట్రోక్ నిపుణుల మార్గదర్శకాలు సూచిస్తున్నాయి.

**ప్రొటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు**

స్ట్రోక్ తర్వాత శరీర బలాన్ని తిరిగి పొందడంలో తగినంత ప్రొటీన్ తీసుకోవడం ముఖ్యమైన అంశం. పప్పులు, శనగలు, పెసలు, పాలు లేదా తక్కువ కొవ్వు ఉన్న పాల ఉత్పత్తులు, గుడ్లు, వైద్యుల సూచనలకు అనుగుణంగా చేపలు వంటి ఆహారాలను ఉపయోగించవచ్చు. వ్యక్తి వయసు, బరువు, ఇతర ఆరోగ్య సమస్యలు, మింగడంలో ఉన్న ఇబ్బందులను బట్టి ప్రొటీన్ అవసరం మారవచ్చు.

వాల్‌నట్స్, బాదం వంటి నట్స్, అవిసె గింజలు వంటి గింజలను పరిమిత మోతాదులో తీసుకోవచ్చు. చేపల్లో లభించే ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు కూడా ఆరోగ్యకరమైన ఆహారంలో భాగం కావచ్చు. అయితే ఇవి స్ట్రోక్‌ను నయం చేసే మందులుగా భావించకూడదు. ఆహారంలోని మొత్తం సమతుల్యతే ప్రధాన విషయం.

**ఉప్పు, ప్రాసెస్డ్ ఫుడ్స్ తగ్గించాలి**

స్ట్రోక్ తర్వాత ఆహారంలో అత్యంత జాగ్రత్తగా చూడాల్సిన అంశాల్లో ఉప్పు ఒకటి. అధిక సోడియం తీసుకోవడం రక్తపోటును పెంచే అవకాశం ఉంది. అధిక రక్తపోటు స్ట్రోక్‌కు ముఖ్యమైన ప్రమాద కారకం కావడంతో, ఉప్పు ఎక్కువగా ఉండే ప్యాకేజ్డ్ ఫుడ్స్, ఇన్‌స్టంట్ ఫుడ్స్, కొన్ని ప్రాసెస్డ్ స్నాక్స్‌ను తగ్గించడం మంచిది. అదేవిధంగా ట్రాన్స్‌ఫ్యాట్, సాచ్యురేటెడ్ ఫ్యాట్ అధికంగా ఉండే ఆహారాలు, అధిక చక్కెర కలిగిన పానీయాలు, తరచూ తీసుకునే ఫాస్ట్‌ఫుడ్, అధికంగా శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లను పరిమితం చేయాలి. వంటల్లో ఎక్కువ ఉప్పు, నూనె వేసే అలవాటుకు బదులుగా ఆవిరిలో ఉడికించడం, ఉడకబెట్టడం, గ్రిల్ చేయడం వంటి పద్ధతులను ఉపయోగించవచ్చు.

**మింగడంలో ఇబ్బంది ఉంటే ప్రత్యేక జాగ్రత్త**

స్ట్రోక్ తర్వాత కొంతమందికి ఆహారం లేదా నీటిని మింగడంలో సమస్య ఏర్పడవచ్చు. ఇలాంటి పరిస్థితిని నిర్లక్ష్యం చేస్తే ఆహారం లేదా ద్రవం శ్వాసనాళంలోకి వెళ్లే ప్రమాదం ఉంటుంది. అందుకే రోగికి మింగడంలో ఇబ్బంది ఉంటే వైద్యుడు లేదా స్పీచ్‌లాంగ్వేజ్ థెరపిస్ట్ సూచనల మేరకు మాత్రమే ఆహారం యొక్క మెత్తదనం, ద్రవాల చిక్కదనాన్ని మార్చాలి.

నీటిని పూర్తిగా మానేయడం లేదా స్వయంగా ద్రవాలను చిక్కగా చేయడం వంటి నిర్ణయాలు తీసుకోకూడదు. అలాగే విటమిన్‌డి, బి12, ఐరన్, ఫోలేట్ వంటి పోషకాల లోపం ఉందని అనుమానంతో సొంతంగా సప్లిమెంట్లు వాడకూడదు. అవసరమైతే వైద్యులు పరీక్షల ఆధారంగా వాటిని సూచిస్తారు.

**ఆహారంతో పాటు రిహాబిలిటేషన్ ముఖ్యం**

స్ట్రోక్ నుంచి కోలుకోవడంలో ఆహారం ఒక్కటే పరిష్కారం కాదు. ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, స్పీచ్ థెరపీ వంటి పునరావాస చికిత్సలు కూడా వ్యక్తి పరిస్థితిని బట్టి కీలకంగా ఉంటాయి. స్ట్రోక్ తర్వాత కోల్పోయిన కదలికలు, మాట, రోజువారీ పనులు వంటి సామర్థ్యాలను తిరిగి సాధించడానికి రిహాబిలిటేషన్ ఉపయోగపడుతుంది. అందువల్ల ఉదయం ఓట్స్ లేదా ఇతర సంపూర్ణ ధాన్యాలతో కూడిన అల్పాహారం, మధ్యాహ్నం పప్పుకూరగాయలతో కూడిన భోజనం, మధ్యలో పండు లేదా పరిమిత మోతాదులో నట్స్, రాత్రి తేలికపాటి సమతుల్య ఆహారం వంటి విధానాన్ని వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా వైద్యుడు లేదా డైటీషియన్ సూచించవచ్చు. తగినంత ద్రవాలు తీసుకోవడం కూడా ముఖ్యం.. అయితే మింగడంలో సమస్య ఉన్నవారు తప్పనిసరిగా వైద్యుల సూచనలు పాటించాలి.ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సింది ఏమిటంటే.. స్ట్రోక్ నుంచి రికవరీ ఒక్కరోజులో జరిగేది కాదు. కొందరిలో వారాలు, మరికొందరిలో నెలలు లేదా అంతకంటే ఎక్కువ కాలం పట్టవచ్చు. సరైన వైద్య చికిత్స, మందులు, పునరావాసం, ఆరోగ్యకరమైన ఆహారం, తగిన నిద్ర, రక్తపోటుచక్కెర నియంత్రణ వంటి అంశాలు కలిపి రికవరీ ప్రక్రియకు తోడ్పడతాయి.





## గాంధీ, శాస్త్రి జయంతి సందర్భంగా సంస్మరణ సభ

**కుషాయిగూడ, మహా :** మహాత్మా గాంధీ 157వ జయంతి, లాల్‌బహదూర్ శాస్త్రి 122వ జయంతి సందర్భంగా తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కాప్రా జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయ ప్రాంగణంలో సంస్మరణ సభ, మతోన్మాద వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ప్రముఖ విజ్ఞానవేత్త వెంకటాచలం మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో గాంధీ కీలక పాత్ర పోషించారని, సత్యాగ్రహం, అహింసా మార్గాల ద్వారా ప్రజలను ఐక్యం చేశారని అన్నారు. అన్ని మతాల మధ్య శాంతి, సామరస్యాన్ని పెంపొందించేందుకు కృషి చేశారని పేర్కొన్నారు. స్ఫూర్తి గ్రూప్ సీనియర్ నాయకులు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ దక్షిణాఫ్రికాలో వర్ణవివక్షను ఎదుర్కొన్న గాంధీ అక్కడి భారతీయుల హక్కుల కోసం పోరాటం ప్రారంభించారని తెలిపారు. అనంతరం భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. మత విద్వేషాలకు వ్యతిరేకంగా గాంధీ చివరి వరకు పోరాడారని పేర్కొన్నారు. లాల్‌బహదూర్ శాస్త్రి నిరాడంబర జీవితం గడిపారని, "జై జవాన్-జై కిసాన్" నినాదంతో దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపారని వక్తలు కొనియాడారు. అనంతరం సభ్యులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కోమటి రవి, పి. మల్లేశం, హరిప్రసాద్, శారద, భాస్కర్‌రావు, వెంకటాచలం, ఏ. దుర్గాచారి, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ విజయరమణ రావు

పెద్దపల్లి మహా : సుల్తానాబాద్: గాంధీ జయంతి సందర్భంగా సుల్తానాబాద్ పట్టణంలోని గాంధీనగర్‌లో మహాత్మా గాంధీ విగ్రహానికి ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పట్టణ ప్రజలకు గాంధీ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్, సింగిల్ విండో చైర్మన్లు, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## గాంధీ జయంతి సెలవును ఉల్లంఘించి పాఠశాలల నిర్వహణపై ఏబీవీపీ ఆగ్రహం

**పెద్దపల్లి మహా :** గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన సెలవును పట్టించుకోకుండా జిల్లాలోని కొన్ని పాఠశాలలను నిర్వహించడంపై ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్దపల్లి జిల్లాలోని పలు పాఠశాలలు, ముఖ్యంగా గోదావరిఖనిలోని నారాయణ, శ్రీచైతన్య తదితర పాఠశాలలు ప్రభుత్వ సెలవు ఉన్నప్పటికీ తరగతులు నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్నప్పటికీ సంబంధిత విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేసే విధంగా వ్యవహరిస్తున్న విద్యాసంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ సెలవు నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై కూడా తగిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ తరఫున కోరారు.

# గాంధీ సిద్ధాంతాలు సమాజానికి మార్గదర్శకం

- సత్యం అహింస శాంతి మార్గాల్లో ప్రతి ఒక్కరూ పయనించాలి
- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** జాతిపిత మహాత్మా గాంధీజీ చూపిన సత్యం అహింస శాంతి మార్గాల్లో ప్రతి ఒక్కరూ పయనించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్ అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి పాల్గొని గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల్లో అగ్రగణ్యుడైన మహాత్మా గాంధీజీ సత్యాగ్రహం అహింసాయుత పోరాటం ద్వారా భారత దేశ స్వాతంత్ర్య సాధనకు మార్గం సుగమం చేశారని తెలిపారు. గాంధీజీ చూపిన ఆలోచనలు సిద్ధాంతాలు కేవలం భారతదేశానికే కాకుండా ప్రపంచానికే మార్గదర్శకంగా నిలిచాయని తెలిపారు. గాంధీజీ సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆచరిస్తే సమాజంలో సానుకూల మార్పు తీసుకురావచ్చని అన్నారు. గాంధీజీ బోధనలు నేటి యువతకు ఎంతో ప్రేరణనిస్తాయని కలెక్టర్ అన్నారు. క్రమశిక్షణ నిజాయితీ సేవాభావం సామాజిక బాధ్యతతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని సూచించారు. తమ వృత్తి వ్యక్తిగత జీవితం సామాజిక బాధ్యతల్లో గాంధీజీ ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారా సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గాంధీజీ కలలు కన్న స్వచ్ఛమైన సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ అన్నారు. స్వచ్ఛత పరిశుభ్రతను వ్యక్తిగత బాధ్యతగా భావించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రజాసేవలో పారదర్శకత జవాబుదారీతనం మానవతా విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. గాంధీజీ జీవితం ఆయన ఆచరించిన విలువలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. యువత గాంధీజీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సీపీఓ సునీత, కలెక్టరేట్ ఏవో అనంత రామకృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి అనూష, జిల్లా ఆడిట్ అధికారి శ్రీనివాస్, జిల్లా క్రీడా శాఖ అధికారి పరంధామ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వీబీజీ గ్రామీణ చట్టాన్ని రద్దు చేయాలి

- పాత ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా పునరుద్ధరించాలి
- రోజుకు రూ.800 కూలి.. 200 రోజులకు పనిదినాలు పెంచాలి: జాజిరి శ్రీనివాస్




**సత్తుపల్లి, అక్టోబరు 2:** మహా : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీజీ గ్రామీణ చట్టాన్ని రద్దు చేసి, పాత ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా పునరుద్ధరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి జాజిరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గాంధీ విగ్రహం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. వామపక్షాల పోరాటాల ఫలితంగా యూపీఏ ప్రభుత్వ హయాంలో ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పించేలా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ఆ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి దాని స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకొచ్చిందని విమర్శించారు. కొత్త చట్టంలో పనిదినాలను 125 రోజులకు పెంచినప్పటికీ, నిధుల కేటాయింపులో కోత విధించడం వల్ల రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం పడుతుందని తెలిపారు. కేంద్రం రాష్ట్రాల మధ్య నిధుల వాటాలో మార్పులతో ఉపాధి హామీ పథకం అమలుపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. పారదర్శకత పేరుతో కూలీల ఫొటోలను రెండుసార్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తేనే వేతనాలు చెల్లించే విధానం ఇబ్బందికరంగా మారుతుందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు.

200 రోజుల పని.. రూ.800 కూలి

లగ్రామీణ పేదలకు ఏడాదికి కనీసం 200 రోజుల పనిని హామీ ఇవ్వాలని, రోజువారీ కూలిని రూ.800కు పెంచాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంత పేదలకు కూడా ఉపాధి హామీ పనులను విస్తరించాలని కోరారు. పాత గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా పునరుద్ధరించే వరకు పోరాటాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి మండల అధ్యక్షురాలు పిల్లి నాగమణి, కార్యదర్శి కువ్వారపు లక్ష్మణరావు, బండి వేల్పాద్రి, ప్రజానాట్యమండలి డివిజన్ కార్యదర్శి అయినంపూడి సారంగరావు, కేవీపీఎస్ మండల కార్యదర్శి దాట్ల రాంబాబు, సీఐటీయూ మండల నాయకులు తడికమళ్ల రామకృష్ణ, సప్పిడి భాస్కర్, తోటకూర వెంకట్రావు, బెజవాడ లక్ష్మీనారాయణ, మల్లాది వెంకట్, పరమేష్, ఐద్వా మండల కమిటీ సభ్యులు సరోజిని, ఆమని తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

**మణుగూరు, మహా :** జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతూ టీయూడబ్ల్యూజే-ఐజేయూ నాయకులు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కేంద్ర కమిటీ పిలుపు, రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు పినపాక నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులు అనేక వృత్తిపరమైన సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమన్నారు. వారి సంక్షేమం, భద్రత, వృత్తిపరమైన సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పినపాక నియోజకవర్గ పరిధిలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలతో పాటు వారి సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు జర్నలిస్టులు ప్రస్తావించిన సమస్యలను సానుకూలంగా పరిశీలిస్తానని తెలిపారు. అవసరమైన అంశాలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే-ఐజేయూ జిల్లా నాయకులు, పినపాక నియోజకవర్గ కమిటీ నాయకులు, మణుగూరు మండల నాయకులు, పినపాక నియోజకవర్గ పరిధిలోని జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# 43 మంది లబ్ధిదారులకు రూ.63.65 లక్షల ఆర్థిక సాయం

- కళ్యాణలక్ష్మి, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ విజయరమణ రావు

**పెద్దపల్లి మహా :** పెద్దపల్లి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 30 మంది లబ్ధిదారులకు రూ.50.64 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను, ఎలిగేడు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 13 మంది లబ్ధిదారులకు రూ.13,01,508 విలువైన కళ్యాణలక్ష్మి చెక్కులను రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పంపిణీ చేశారు. స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ప్రభుత్వం పేద, నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎలిగేడు తహసీల్దార్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, పలు గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో రామగుండం కమిషనరేట్‌కు 7 పతకాలు

**పెద్దపల్లి మహా, :** రామగుండం: 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026 క్లస్టర్-C పోటీల్లో రామగుండం పోలీస్ కమిషనరేట్ క్రీడాకారులు సత్తా చాటారు. హైదరాబాద్‌లోని ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు జరిగిన పోటీల్లో కాళేశ్వరం జోన్-I తరపున పాల్గొన్న రామగుండం కమిషనరేట్ క్రీడాకారులు 1 రజతం, 6 కాంస్య పతకాలు సాధించారు. టేబుల్ టెన్నిస్ విభాగంలో ఐదు కాంస్య పతకాలు, బ్యాడ్మింటన్‌లో ఒక రజతం, ఒక కాంస్య పతకం సాధించారు. మొత్తం 17 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఐపీఎస్ క్రీడాకారులను శాలువాలతో సత్కరించి అభినందించారు. విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి కమిషనరేట్‌కు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమన్నారు. క్రీడలు పోలీసు అధికారులు, సిబ్బందిలో శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందిని శాఖ తరపున ప్రోత్సహిస్తూ అవసరమైన సహకారం అందిస్తామని సీపీ తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధించాలని క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు మల్లేశం, శేఖర్, రమేష్, సీసీ సందీప్, ఆర్ఎస్ఐలు, రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు నవీన్, సభ్యులు వినోద్ తదితరులు పాల్గొన్నారు.





## గాంధీ మార్గమే.. సమాజానికి స్ఫూర్తి

**సత్తుపల్లి, అక్టోబరు 2: మహా :** సత్యం, అహింసను ఆయుధాలుగా మలుచుకుని బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా మహాత్మా గాంధీ సాగించిన పోరాటం దేశ చరిత్రలో చిరస్మరణీయమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయంలో, ప్రధాన రహదారి సమీపంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సహాయ నిరాకరణ, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా వంటి ఉద్యమాలతో గాంధీ ప్రజలను స్వాతంత్ర్య సంగ్రామంలో భాగస్వాములను చేశారని గుర్తుచేశారు. హింసకు తావులేకుండా ప్రజా ఉద్యమాల ద్వారా బ్రిటిష్ పాలనపై ఒత్తిడి తీసుకురావడం ఆయన నాయకత్వ ప్రత్యేకతగా పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చూపిన ధైర్యం, నిబద్ధత, త్యాగం నేటి తరానికి ఆదర్శమన్నారు. స్వేచ్ఛతో పాటు సామాజిక సమానత్వం, పరిశుభ్రత, గ్రామ స్వరాజ్యం, మత సామరస్యం వంటి విలువలకు గాంధీ ప్రాధాన్యం ఇచ్చారని రాగమయి తెలిపారు. ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడమే నిజమైన నివాళి అని తెలుపుతూ శాంతియుతమైన, పరిశుభ్రమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహ, చైర్‌పర్సన్ రిహానా బేగం కమల్ పాషా, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, మండల అధ్యక్షుడు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు బొంతు వేణు, సుమలత, కౌన్సిలర్లు, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



## గాంధీజీ ఆశయాలే... యువతకు స్ఫూర్తి

**జవహర్ నగర్, మహా :** గాంధీజీ ఆశయాలే యువతకు స్ఫూర్తి అని, శాంతి బాటలో పయనించి అభివృద్ధిలో ముందుకెలదామని జవహర్ నగర్, మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తాలు పేర్కొన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని జవహర్ నగర్ మూడవ డివిజన్ పాపయ్య నగర్ కాలనీలో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తాలు హాజరై మాట్లాడుతూ" అహింస బలహీనుల బలహీనత కాదని అది అత్యంత ధైర్యవంతుల ఆయుధమన్నారు". ప్రతి ఒక్కరూ గాంధీజీ స్ఫూర్తి మాటలు గుర్తుకు చేసుకోవాలని తెలిపారు. గాంధీజీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యమే మిన్న అని అన్నారు. ఆలోచనలు మాటలు ఒకేలా ఉన్నప్పుడే నిజమైన ఆనందం లభిస్తుందని, ఈ ప్రపంచంలో నువ్వు చూడాలనుకున్న మార్పు నీతోటే మొదలవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు శ్రీనివాస్ రెడ్డి, గొడుగు వేణు, పల్లపు రవి, కాలనీవాసులు శ్రీమాన్, నర్సింగ్, బాలు, భారతి, రాజు తదితరులు పాల్గొన్నారు.



## మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలు

**ఎంపీడీవో జలంధర్ రెడ్డి**

వలిగొండ అక్టోబర్ 2 మహా న్యూస్: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఎంపీడీవో జలంధర్ రెడ్డి గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు ఈ సందర్భంగా ఎంపీడీవో జలంధర్ రెడ్డి మాట్లాడుతూ గాంధీ చూపిన సత్యం అహింస శాంతి స్వచ్ఛత మార్గాలను ప్రతి ఒక్కరు అనుసరించాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## పందిల్లలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

**పెద్దపల్లి మహా :** కాల్వ శ్రీరాంపూర్ :పందిల్ల గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామ సర్పంచ్ మిట్టపల్లి కొమురయ్య ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం నిర్వహించిన గ్రామసభలో గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలతో పాటు, రానున్న బతుకమ్మ పండుగ సంబరాల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దర్ముల రవి, మాజీ ఎంపీటీసీ రావి సదానందం, గ్రామపంచాయతీ కార్యదర్శి మహేందర్, వార్డు సభ్యులు ఇల్లందుల శంకర్ గౌడ్, చిలుముల స్వరూప, కొత్తగట్టు కళ్యాణి, మధు, తాండ్ర రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్, చిలుముల మల్లేష్‌తో పాటు గ్రామ ప్రజలు, యువకులు, ఉపాధి హామీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లిలో రేపు బీఆర్ఎస్ బీసీ సెల్ ముఖ్య నాయకుల సమావేశం

**పెద్దపల్లి మహా :** పెద్దపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ ముఖ్య నాయకుల సమావేశం శనివారం (అక్టోబర్ 3) ఉదయం 10 గంటలకు రంగంపల్లిలోని ఆర్.ఆర్. గార్డెన్‌లో నిర్వహించనున్నారు. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్సీలు ఎల్. రమణ, దాసోజు శ్రవణ్ కుమార్, మాజీ అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ బాలరాజు యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.ఈ సమావేశంలో బీసీ సెల్ నాయకులతో పలు అంశాలపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్నారు. నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ బీసీ సెల్ ముఖ్య నాయకులందరూ సమావేశానికి హాజరుకావాలని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి కోరారు.

## మహాత్మా గాంధీ జీవన విధానం ప్రతి ఒక్కరికీ ఆదర్శం: జిల్లా కలెక్టర్

**పెద్దపల్లి మహా,** జాతిపిత మహాత్మా గాంధీ జీవన విధానం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష జ్యోతి ప్రజ్వలన చేసి, మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. గాంధీజీ సత్యం, అహింస, శాంతి మార్గాలను అనుసరించి దేశానికి చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని కలెక్టర్ సూచించారు.





# రోగుల సౌకర్యానికి క్యాంటీన్ సేవలు

- నూతన ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రారంభించిన ఎమ్మెల్యే రాగమయి

**సత్తుపల్లి, అక్టోబరు 2**:మహా : నూతన ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు, వెంట వచ్చే సహాయకుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నూతన క్యాంటీన్‌ను ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఆహారం, అల్పాహారం వంటి కనీస అవసరాలు అందుబాటులో ఉండటం ఎంతో అవసరమన్నారు. రోగుల ఇబ్బందులను గుర్తించి క్యాంటీన్ ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. క్యాంటీన్‌లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యవంతమైన సేవలు అందించాలని అన్నారు. వైద్య సేవలతో పాటు ఇటువంటి మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావడంతో ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రజలకు మరింత నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా బేగం కమల్ పాషా, సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మోరిశెట్టి సాంబశివరావు, ఫయాజ్, ఇనపనూరి కుమారి, ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, సిబ్బంది, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు బొంతు వేణు, సుమలత, మున్సిపల్ కౌన్సిలర్లు, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



# జర్నలిస్టులకు క్యాష్ లెస్ హెల్త్ కార్డులు ఇవ్వాలి

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: ఉద్యోగులతో సమానంగా షరతులు లేని క్యాష్ లెస్ హెల్త్ కార్డులు జారీ చేయడంతో పాటుగా జర్నలిస్టులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేస్తూ టీయూడబ్ల్యూ(టీజేఎఫ్)143 ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పోస్ట్ కార్డు ద్వారా విన్నప కార్యక్రమాన్ని శుక్రవారం కొత్తగూడెం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జిల్లా అధ్యక్షులు కల్లోజి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా హెల్త్ కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వం ఉద్యోగులతో సమానంగా అర్హత కలిగిన ప్రతి జర్నబలిస్టుకు హెల్త్ కార్డు మంజూరు చేసి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కోరారు. రాష్ట్రంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని జర్నలిస్టుల సంక్షేమ కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ఒకవైపు చెబుతూనే సమస్యలు తీర్చకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా జర్నలిస్టు సంక్షేమానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే(టీజేఎఫ్) నాయకులు వట్టి కొండ రవి, సహాయ కార్యదర్శి కాగితపు వెంకటేశ్వరరావు, కృష్ణ గోవింద్, మోటమర్రి రామకృష్ణ, సీమకుర్తి రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, నాయకులు చావా పాపారావు, కృష్ణారావు రమేష్, రమణ, తారక్, అశోక్, ప్రవీణ్, ఈశ్వర్ షబ్బీర్, శ్రీనివాస్, రాందాస్, జక్కంపూడి నరేష్ సత్య, శనగ లక్ష్మణ్, రహీం, స్వామి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



# గాంధీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి..

- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**మణుగూరు, మహా** : జాతిపిత మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలను ప్రతి ఒక్కరూ ఆచరిస్తూ ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా మణుగూరు మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో గాంధీజీ పోషించిన కీలక పాత్రను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. గాంధీజీ అనుసరించిన అహింసా మార్గం, సత్యాగ్రహ సిద్ధాంతాలు నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అంటరానితనం నిర్మూలన, సామాజిక సమానత్వం, గ్రామ స్వరాజ్యం, స్వదేశీ వస్తువుల వినియోగం, పేదల అభ్యున్నతికి గాంధీజీ ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. ప్రస్తుత సమాజంలో శాంతి, సహనం, పరస్పర గౌరవం, సోదరభావం మరింత అవసరమని పేర్కొన్నారు. విభేదాలను హింసకు తావులేకుండా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ముఖ్యంగా యువత గాంధీజీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని సత్యం, అహింస, క్రమశిక్షణ, సేవాభావం వంటి విలువలను ఆచరించాలని కోరారు. పేదలు, బలహీన వర్గాలు, అణగారిన ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తూ సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావడమే మహాత్మా గాంధీకి అందించే నిజమైన నివాళి అని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షుడు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొని గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# గాంధీ ఆశయాలు సమాజానికి మార్గదర్శకం..

**మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురు కృష్ణ**

**మణుగూరు, మహా :** మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, న్యాయం మార్గాలు నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురు కృష్ణ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా మణుగూరు బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయవాదుల ఆధ్వర్యంలో గాంధీజీకి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గురు కృష్ణ మాట్లాడుతూ ప్రతి పౌరుడు పరస్పర గౌరవం, సహనం, సేవాభావంతో వ్యవహరిస్తే శాంతియుతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. న్యాయవాదులు ప్రజలకు న్యాయం చేరువ చేయడంతో పాటు సామాజిక బాధ్యతను కూడా నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు వీరంకి పద్మావతి, కామసాని మధుసూదన్, సునీత, వాసవి, నాగార్జున రెడ్డి, ఎంఎల్ఎస్సీ కోఆర్డినేటర్ రవీందర్ తదితరులు పాల్గొని మహాత్మా గాంధీకి నివాళులర్పించారు.

# జాతీయ మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి

- కేంద్రం మీడియా చట్టాన్ని తీసుకురావాలి
- ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డుల సమస్యను పరిష్కరించాలి
- టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి




**కుషాయిగూడ, మహా** : జాతీయ మీడియా కమిషన్ ను ఏర్పాటు చేయాలని, ఆ కమిషన్ సిఫార్సుల మేరకు కేంద్ర ప్రభుత్వం కొత్త మీడియా చట్టాన్ని తీసుకొచ్చి జర్నలిస్టులు, మీడియా సంస్థల సమస్యలు పరిష్కరించాని టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి మోతే వెంకట రెడ్డి పేర్కొన్నారు. ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ పిలుపుమేరకు అక్టోబర్ 2న జర్నలిస్టుల డిమాండ్స్ డే ను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా కార్యదర్శి డి వెంకట్రాంరెడ్డి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తాలో జర్నలిస్టులు ర్యాలీ చేపట్టిన అనంతరం గాంధీ విగ్రహానికి జర్నలిస్టుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. టీయుడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి మోతే వెంకటరెడ్డి, స్టేట్ కౌన్సిల్ సభ్యులు టి మల్కయ్య లు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభంగా పనిచేస్తున్న జర్నలిస్టులు, మీడియా సంస్థల భద్రత కోసం ప్రత్యేక కేంద్ర చట్టాన్ని రూపొందించాలన్నారు. అందుకోసం కేంద్రం మీడియా రంగంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా నూతన చట్టం రూపొందించేందుకు తగు సిఫార్సుల కోసం జాతీయ స్థాయిలో మీడియా కమిషన్ ను ఏర్పాటు చేయాలన్నారు. 1955, 1958 సంవత్సరాల చట్టాల ద్వారా గతంలో జర్నలిస్టులకు కల్పించబడిన ప్రత్యేక రక్షణలను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మీడియా ఉద్యోగుల కోసం కొత్త వేతన బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. టియుడబ్ల్యూ జే మేడ్చల్ జిల్లా కార్యదర్శి దొంతుల వెంకట్రాం రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొలువుదీరి మూడు సంవత్సరాలు కావస్తున్న జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. జర్నలిస్టుల ఇండ్లు, ఇండ్ల స్థలాల, ఆరోగ్య భద్రత కార్డుల సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ ఆరోగ్య సంరక్షణ సదుపాయాలను తక్షణమే పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే కాప్రా ప్రెస్ క్లబ్, మేడిపల్లి ప్రెస్ క్లబ్, ఉప్పల్ ప్రెస్ క్లబ్, షామీర్ పేట ప్రెస్ క్లబ్, కీసర ప్రెస్ క్లబ్, ఘట్కేసర్ ప్రెస్ క్లబ్, ఉప్పల్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, అల్వాల్ ప్రెస్ క్లబ్ ల ప్రతినిధులు, జవహర్ నగర్, మల్కాజిగిరి జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సోనియా గాంధీ నగర్ లో. మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు

**కుషాయిగూడ, మహా:** కుషాయిగూడ డివిజన్ పరిధిలోని సోనియా గాంధీ నగర్ ఫేస్ వన్ కాలనీలో శుక్రవారం జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు సోనియా గాంధీ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, కుందనపల్లి సిద్దు రాములు, బంకు శ్రీను తదితరులు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. బ్రిటిష్ వలసవాదం నుండి భారతదేశానికి విముక్తి కల్పించి స్వాతంత్రం తేవడంలో గాంధీజీ సుభాష్ చంద్రబోస్, లాల్ బహుదూర్ శాస్త్రి, సర్దార్ వల్లభాయ్ పటేల్, భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ఉరి కంబాన్ని ఎక్కి ముద్దాడిన వీర యోధులను ఎప్పుడు భారత దేశ చరిత్ర మర్చిపోదన్నారు. జతిన్ దాస్ లాహోర్ సెంట్రల్ జైల్లో 63 రోజులు కఠోరమైన ఆమరణ నిరాహార దీక్ష చేస్తూ అమృతం పొందారని, అగ్గిపిడుగు అల్లూరి సీతారామరాజు, చంద్రశేఖర్ ఆజాద్ తదితరులు వేలాదిమంది తమ రక్తాలను చిందించారని గుర్తు చేశారు గాంధీజీ బతికి ఉంటే ప్రకృతి వైద్యాన్ని మరింత ప్రచారం చేసేవాడని, స్వాతంత్రం సిద్ధించాక కొద్ది నెలలకే నాదూరం గాడ్సే చేతిలో నమ్మకద్రోహానికి గురై ప్రాణాలు కోల్పోయాడని ఆవేదన వ్యక్తం చేశారు.మానవ సమాజం ఉన్నంతవరకు గాంధీజీ ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడు రాస్మరణీయుడని కొనియాడారు.

# రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

**పెద్దపల్లి మహా** : రామగుండం: జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను శుక్రవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఐపీఎస్ మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సత్యం, అహింసా మార్గాల్లో నడిచి దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీ కీలక పాత్ర పోషించారని తెలిపారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస, సహనం, ధర్మం వంటి విలువలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని సూచించారు.గాంధీజీ ఆశయాలను భావితరాలకు తెలియజేస్తూ, గాంధేయ స్ఫూర్తితో ప్రజలకు సేవలందించాలని పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. ప్రజలకు న్యాయం, భద్రత, సేవలు అందించడంలో నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని అన్నారు.కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు మల్లేశం, శేఖర్, రమేష్, సీసీ సందీప్, ఆర్ఎస్ఐలు, రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు నవీన్, సభ్యులు వినోద్ తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో సర్వమత ప్రార్ధనలు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి సందర్భంగా సింగరేణి డిస్ట్రిక్ అసోషియేషన్ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యంలో శుక్రవారం సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ హెడ్ క్వార్టర్స్ చిల్డ్రన్స్ పార్క్ నందు భారత దేశ సర్వమానవాళి శాంతిని కాంక్షిస్తూ సర్వమత ప్రార్ధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా డిజిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ కమిషనర్ బి.శివ కేశవరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏడాది అక్టోబర్ 2న మహాత్మా గాంధీ జయంతి సంధర్భముగా సింగరేణి డిస్ట్రిక్ అసోషియేషన్ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో సర్వమత ప్రార్ధనలు జరుపుకోవటం చాలా సంతోషమని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ కలలను సాకారం చేసే విధముగా ఇకమత్యంతో జాతి కుల భేదాలు లేకుండా కలసి మెలసి ఉండాలని అహింసా సేవా భావాన్ని ప్రతి ఒక్కరూ పాటిస్తూ ఆ మహానుభావుని కలలను సాకారం చేయాలని కోరారు. అనంతరం సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ హెడ్ క్వార్టర్స్ చిల్డ్రన్స్ పార్క్ నుండి సూపర్ బజార్ 3 టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద గల మహాత్మా గాంధీ విగ్రహం వరకు రెంజర్ టీం లీడర్లు గైడ్ కెప్టెన్లు రోవర్స్, స్కౌట్స్ వివిధ పాఠశాలల విద్యార్ధినీ విద్యార్ధులతో కలసి ర్యాలీ నిర్వహించి మహాత్మా గాంధీ విగ్రహానికి పులమాలలతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డివైపిఎం కే.శివ కుమార్, సీనియర్ పిఓ అండ్ సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ కమిషనర్ మండల శ్రీనివాస్ తో పాటు వెల్ఫేర్ పిఏ కే.వరప్రసాద్, బిఎస్‌జి కొ ఆర్డినేటర్ పి.సాయి నిరంజన్, సీనియర్ రోవర్ స్కౌట్ లీడర్లు కొమరయ్య, వి.వెంకట స్వామి, ఎల్.గోపాల కృష్ణయ్య, రామ స్వామి, భాగం శ్రీనివాస రావు, స్కౌట్ మాస్టర్లు, రోవర్ స్కౌట్ లీడర్లు, రెంజర్ టీం లీడర్లు, గైడ్ కెప్టెన్లు రోవర్స్, స్కౌట్స్ వివిధ పాఠశాలల విద్యార్ధి విద్యార్ధులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీకి ఘన నివాళులు

**పలు డివిజన్లలో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే**



**కుషాయిగూడ, మహా:** జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం ఉప్పల్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని సోనియా గాంధీ నగర్, ఈసీ నగర్, మీర్‌పేట-హెచ్‌బీ కాలనీ డివిజన్, మల్లాపూర్ ప్రాంతాల్లో నిర్వహించిన గాంధీ జయంతి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి, సత్యాగ్రహం మార్గాలు నేటి సమాజానికి కూడా ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే అన్నారు .దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన త్యాగాలు, ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చిన తీరు చిరస్మరణీయమని అన్నారు. గాంధీజీ కలలు కన్న స్వచ్ఛమైన, సమానత్వంతో కూడిన, శాంతియుతమైన భారతదేశం నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. గాంధీజీ ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారా సమాజంలో సోదరభావం, సామాజిక బాధ్యత మరింత బలోపేతం అవుతుందని అన్నారు.అనంతరం ఆయా ప్రాంతాల్లో ప్రజలతో కలిసి గాంధీజీకి నివాళులు అర్పించి, ఆయన ఆశయాలను స్మరించుకున్నారు. కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# మహాత్ముడు మళ్ళీ రావాలి

- కార్పొరేటర్ మునిగడప పద్మ వెంకటేశ్వర్లు
- ఘనంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలు



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** మహాత్ముడు మళ్లీ పుట్టి రావాలని 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ అన్నారు. శుక్రవారం మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని రామవరం హై స్కూల్ లో గల మహాత్మా గాంధీ విగ్రహానికి మునిగడప పద్మ దంపతులు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలపై చిన్న పిల్లలపై అత్యాచారాలు జరుగుతున్న ఏమీ చేయలేని దుస్థితిలో చట్టాలు, ప్రభుత్వాలు ఉన్నాయని అందుకే ఓ మహాత్మ మళ్ళీ మీరు రావాలి ఈ సమాజాన్ని ఒక క్రమ పద్ధతిలో నడిపించాలని మునిగడప పద్మ వెంకటేశ్వర్లు అన్నారు. ఉపాధ్యాయులకు, రక్షక భటులకు ఆయన చేతి ఊత కర్రను అందించి గాడి తప్పిన సమాజాన్ని సరైన గమ్యంలో నడిచేలా చూడాలని మునిగడప పద్మ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. పుస్తక జ్ఞాన సంపదను మరిచి చరవాణి మోజులో యువత పెడమార్గంలో ప్రయాణిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. హానికర మత్తుపదార్థాల తయారీకి అనుమతిస్తూ ప్రభుత్వాలే ప్రోత్సహించి ప్రజా వ్యవస్థను చిన్న భిన్నం చేస్తున్నారని అన్నారు. పైకి మాత్రం మత్తు పదార్థాలు హానికరం అంటూ ప్రచారానికే పరిమితం అవుతున్నారని విమర్శించారు. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే మద్యపానాన్ని మత్తు పదార్థాల తయారీని ఆపే చట్టాలు తేవాలని ఆమె ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. అప్పుడే మనం మహాత్ముడికి ఘనమైన నివాళులు ఇచ్చినట్లు అవుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్, న్యాయవాది మునిగడప వెంకటేశ్వర్లు, గుంజా వెంకన్న, చింటూ తదితరులు పాల్గొన్నారు.



# 15వ బెటాలియన్‌లో ఘనంగా గాంధీజీ జయంతి

**సత్తుపల్లి, అక్టోబరు 2:మహా :** బి.గంగారంలోని 15వ ప్రత్యేక పోలీసు బెటాలియన్‌లో మహాత్మా గాంధీజీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ ఎన్.పెద్దబాబు గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిటిష్ పాలన నుంచి భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో మహాత్మా గాంధీజీ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. సత్యం, అహింసను ఆయుధాలుగా చేసుకుని ప్రజలను స్వాతంత్ర్య ఉద్యమంలో ఏకతాటిపైకి తీసుకొచ్చారని తెలిపారు. సహాయ నిరాకరణ, సత్యాగ్రహ ఉద్యమాల ద్వారా అహింసా మార్గంలో స్వాతంత్ర్య పోరాటాన్ని ముందుకు నడిపిన మహనీయుడిగా గాంధీజీ దేశ ప్రజల గౌరవాన్ని పొందారని అన్నారు. గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, ఆయన చూపిన సత్యం, అహింస మార్గంలో నడుస్తూ సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గాంధీజీ కలలుగన్న సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు దళాధిపతి ఎ.అంజయ్య, సహాయ దళాధిపతి బి.వినాయకరావుతో పాటు అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొని గాంధీజీకి నివాళులర్పించారు.



# అర్ధరాత్రి ఆపరేషన్.. తల్లి–కవలలు క్షేమం..

**భద్రాచలం/మణుగూరు, మహా:** తీవ్ర రక్తహీనత, అధిక రక్తపోటుతో పాటు కవలల గర్భంతో ఉన్న గిరిజన మహిళకు మణుగూరు, భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు సమన్వయంతో సురక్షిత ప్రసవం నిర్వహించారు. మణుగూరు మండలం పగిడేరు గ్రామానికి చెందిన భీమమ్మ అక్టోబర్ 1 రాత్రి మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకోగా, ఆమె హిమోగ్లోబిన్ 6 గ్రాములు, రక్తపోటు 180/120గా నమోదైంది. రాత్రి 11 గంటలకు 1.6 కిలోల బరువున్న మగ బిడ్డ సాధారణ ప్రసవం ద్వారా జన్మించాడు. అనంతరం రెండో శిశువు ప్రసవంలో ఇబ్బంది ఏర్పడటంతో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి అత్యవసరంగా తరలించారు. అక్కడ అర్ధరాత్రి 12.30 గంటలకు సిజేరియన్ నిర్వహించి 2.2 కిలోల బరువున్న ఆడబిడ్డను ప్రసవింపజేశారు. ప్రస్తుతం తల్లితో పాటు ఇద్దరు శిశువులు క్షేమంగా వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. రెండు ఆసుపత్రుల వైద్య, నర్సింగ్ బృందాల సమన్వయంతో సకాలంలో చికిత్స అందించడంతో తల్లి, కవలలకు ప్రాణాపాయం తప్పిందని అధికారులు తెలిపారు.



# ఎస్పీ క్యాంపు ఆఫీసులో గాంధీ జయంతి వేడుకలు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గాంధీజీ సత్యం అహింసా మార్గాలు దేశ ప్రజలకు ఆదర్శం అని పేర్కొన్నారు. గాంధీజీ ఆశయాలు సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సమాజంలో శాంతి సౌభ్రాతృత్వం సామాజిక బాధ్యతలను పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, సీఐలు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఇంద్రసేనారెడ్డి, కరుణాకర్, ఆర్ఐలు సుధాకర్, రవి, లాల్ బాబు, కృష్ణారావు, ట్రాఫిక్ ఎస్ఐ ప్రవీణ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా మహాత్మాగాంధీ 157వ జయంతి

- ఆయన చిత్రపటానికి నివాళులర్పించిన డిసిసి అధ్యక్షురాలు
- బాలాపూర్ 62వ డివిజన్లో ఘనంగా గాంధీజీ జయంతి

**బాలాపూర్ అక్టోబర్ 2 మహా**: మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ 62వ డివిజన్ అధ్యక్షులు, నీరుడు శ్రీరాములు ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. బడంగ్పేట్ సర్కిల్, బాలాపూర్ డివిజన్లో మహాత్మాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు పారిజాత నర్సింహారెడ్డి, మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. దేశ స్వతంత్రం కోసం గాంధీజీ చేసిన త్యాగాలను గుర్తు చేశారు. క్విట్ ఇండియా ఉద్యమంతో బ్రిటిష్ పాలనను దేశం నుంచి తరిమి కొట్టిన మహా వీరుడైన అని ఆమె కొనియాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బడెంపేట్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాల్ లింగని జంగయ్య, మాజీ కార్పొరేటర్ ఎర్ర మహేశ్వరి జయంతి బండారి మనోహర్, బాలు నాయక్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ కులం తిరుపతిరెడ్డి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్ రెడ్డి, టేకుల శశిధర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, పగడాల ఉమేష్, మాదాపురం అనురాధ, టేకుల సుధాకర్ రెడ్డి, ఎన్ సుధాకర్, గండికోట యాదయ్య, ఒంగేటి కొండల్రెడ్డి, గిరికటి కృష్ణంరాజు గౌడ్, గౌరిగే శ్రీశైలం, కళ్లెం సాయికృష్ణారెడ్డి, విక్కీ కొండల్, మహమ్మద్ బాయ్, కళ్లెం మల్లారెడ్డి, బోనగిరి శ్రీనివాస్ నినావాత్ శీను నాయక్ గిరి ముదిరాజ్, బి మల్లారెడ్డి, బై రవి, విశాల్, జొన్నాడ భరత్, బుర్ర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### గాంధీజీ చూపిన సత్యం అహింస

## శాంతి మార్గాలు ఆచరణీయం

- ప్రజాసేవలో నిజాయితీ బాధ్యత పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలి
- జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా**: జాతిపిత మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి, సత్యాగ్రహ మార్గాలు నేటి సమాజానికి కూడా ఎంతో ఆచరణీయమైనవని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. గాంధీజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య సాధనలో మహాత్మా గాంధీజీ కీలక పాత్ర పోషించారని తెలిపారు. ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చి, సత్యం, అహింస, సత్యాగ్రహం వంటి సిద్ధాంతాల ఆధారంగా స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించారని పేర్కొన్నారు. ఎటువంటి హింసకు తావులేకుండా నైతిక విలువలు, శాంతియుత పోరాటం ద్వారా లక్ష్యాన్ని సాధించవచ్చని గాంధీజీ ప్రపంచానికి చాటి చెప్పారని అన్నారు.గాంధీజీ జీవితమే ఒక సందేశమని కలెక్టర్ అన్నారు. సత్యనిష్ఠ, అహింస, నిరాడంబర జీవనం, క్రమశిక్షణ, దేశభక్తి, సేవా భావం వంటి విలువలను ఆయన తన జీవితంలో ఆచరించి చూపారని తెలిపారు. ఈ విలువలు కేవలం స్వాతంత్ర్య ఉద్యమ కాలానికే పరిమితం కాకుండా, నేటి సమాజంలోనూ ప్రతి ఒక్కరి వ్యక్తిగత మరియు సామాజిక జీవితంలో మార్గదర్శకంగా నిలవాలని అన్నారు.ప్రజాసేవలో ఉన్న ప్రతి ఒక్కరూ గాంధీజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో అందేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని అన్నారు. ప్రజల సమస్యలను సానుభూతితో విని, నిబంధనల మేరకు వేగంగా పరిష్కరించడం ద్వారా ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకాన్ని మరింత పెంపొందించవచ్చని పేర్కొన్నారు. సమాజంలో శాంతి, సామరస్యం, పరస్పర గౌరవం, సోదరభావం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని కలెక్టర్ అన్నారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ప్రజలందరూ ఐక్యతతో ముందుకు సాగాలని సూచించారు. పరస్పర సహకారం, మానవతా విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందించుకోవడం ద్వారా బలమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు.గాంధీజీ కలలు కన్న స్వచ్ఛమైన భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో ప్రజలు చురుకుగా భాగస్వామ్యం కావాలని అన్నారు. స్వచ్ఛతను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా రోజువారీ జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు.మహాత్మా గాంధీజీ చూపిన మార్గంలో నడుస్తూ నిజాయితీ, కర్తవ్యనిబద్ధత, సేవా భావం, సామాజిక బాధ్యత వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. గాంధీజీ ఆశయాలను భావితరాలకు అందించేందుకు విద్యార్థులు, యువత ప్రత్యేకంగా ముందుకు రావాలని అన్నారు. దేశ అభివృద్ధి, సమాజ సంక్షేమం కోసం ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించినప్పుడే గాంధీజీ కలలు కన్న సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎమర్జెన్సీ హ్యాండిల్ తాకడంతో అలర్ట్

**రాజేంద్రనగర్, మహా:** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కడప వెళ్లాల్సిన ఇండిగో విమానంలో ప్రయాణికుడు పొరపాటున ఎమర్జెన్సీ ఎగ్జిట్ హ్యాండిల్ను తాకడంతో డోర్ సెన్సార్ అలారం మోగింది. విమానం టేకాఫ్కు ముందు కదలకుండా ఉన్న సమయంలో 35 ఏళ్ల ప్రయాణికుడు సీటు సర్దుకుంటుండగా ఈ ఘటన జరిగింది. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే అతడిని విమానం నుంచి దించి ఆర్జీఐఏ పోలీసులకు అప్పగించారు. విచారణలో హ్యాండిల్ను ఉద్దేశపూర్వకంగా తాకలేదని తేలడంతో పోలీసులు కేసు నమోదు చేయలేదు. ప్రయాణికుడి నుంచి లిఖితపూర్వక హామీ తీసుకుని పంపించారు.



## ప్రతిఒక్కరూ శాంతి మార్గాన్ని అనుసరించాలి

**దమ్మపేట,మహా :** ప్రతి ఒక్కరూ శాంతి మార్గాన్ని అనుసరించాలని ,అప్పుడే దేశం సుభిక్షంగా ఉంటుందని పంచాయతీ సర్పంచ్ పగడాల రమాదేవి పేర్కొన్నారు. అక్టోబర్ 2 మహాత్మాగాంధీ 157వ జయంతి సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు గాంధీ చిత్ర పటానికి పుష్పాలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పగడాల రమాదేవి మాట్లాడుతూ గాంధీజీ జీవితంలో చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ అంగోతు శ్రీనివాసరావు, కార్యదర్శి ,వార్డు మెంబర్లు పానుగంటి లక్ష్మణ్‌రావు, గోళ్ళ భవాని కృష్ణ, గూడ రాంబాబు,ముక్తేశ్వరావు, పిట్టల శ్రీను, గొల్లపల్లి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ అవసరాలకు అనుగుణంగా పనుల నిర్వహణ

- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య

**మంచిర్యాల, మహా**: గ్రామ అవసరాలకు అనుగుణంగా పనులు గుర్తించి చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య అన్నారు. శుక్రవారం జైపూర్ మండలం టేకుమట్ల గ్రామంలో స్వచ్ఛతా హి సేవా లో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామ సభకు ఆయన ఎంపీడీఓ శ్రీపతి బాపు, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సభల్లో గ్రామాభివృద్ధి, ఉపాధి హామీ పనుల ప్రణాళిక, మౌలిక వసతుల కల్పనపై చర్చించి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. వీబీజీ రామ్ జీ పథకం నూతన మార్గదర్శకాల ప్రకారం 375 రకాల పనుల్లో గ్రామానికి అవసరమైన పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని సూచించారు.
గతంలో ఉపాధి హామీగా అమలైన పథకం ప్రస్తుతం వీబీజీ రామ్ జీ పథకం కింద అమలవుతోందని, ప్రతి జాబ్ కార్డు కుటుంబానికి ఉపాధి కల్పించడంతో పాటు శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. వర్షాభావం, నీటి కొరత దృష్ట్యా వాటర్ హార్వెస్టింగ్, చెక్ డ్యాములు, ఫీడర్ ఛానళ్ల శుభ్రత, ఇంకుడు గుంతలు, బోర్ వెల్ రీచార్జ్, రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి ప్రభుత్వ భవనం, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని, ఇది పారిశుధ్యంతో పాటు భూగర్భ జలాల పెంపుకు దోహదపడుతుందని తెలిపారు. అనంతరం టేకుమట్ల గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలను సందర్శించి మొక్కలు నాటారు. తర్వాత వేలాల గ్రామ సమీపంలోని గోదావరి నది తీరంలో 2027 గోదావరి పుష్కరాల కోసం రూ. 14.30 కోట్ల అంచనాతో 3 ఎకరాల్లో చేపట్టనున్న పుష్కర ఘాట్, సీసీ రోడ్లు, మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు అవసరమైన రహదారులు, పారిశుధ్యం, తాగునీటి వసతులపై అధికారులకు సూచనలు చేశారు. గట్టు మల్లన్న స్వామి ఆలయాన్ని దర్శించుకుని ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టేకుమట్ల, వేలాల సర్పంచులు బల్ల వెంకటేష్, దేగ స్వప్న, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## పరిశుభ్రత హరితహారం

**భద్రాద్రి కొత్తగూడెం, మహా :** స్వచ్ఛ భారత్ వీక్షిత్ భారత్ ఐటిసి మిషన్ సునేహ్రా కల్ (ఎంఎస్కె), సారపాక గ్రామ పంచాయతీ సహకారంతో "స్వచ్ఛ భారత్ వీక్షిత్ భారత్" స్ఫూర్తిని బలోపేతం చేస్తూ గాంధీ జయంతి సందర్భంగా సత్య సాయి నగర్ పరిధిలో ఉన్న పాఠశాలలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతను ప్రోత్సహించేందుకు ప్రముఖులు పాల్గొని మొక్కలు నాటడం జరిగింది. సత్యసాయి మోడల్ స్కూల్ నుండి గాంధీనగర్ సెంటర్ వరకు సుమారు కిలోమీటరు పొడవునా అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిశుభ్రత బాధ్యతాయుతమైన ప్లాస్టిక్ వాడకం పర్యావరణ పరిరక్షణ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వంటి అంశాలపై పర్యావరణ అనుకూల నినాదాలు సందేశాల ద్వారా స్థానిక సమాజాన్ని మరింతగా చైతన్యపరిచింది. పాఠశాల ప్రాంగణం పరిసర ప్రాంతాలలో పారిశుధ్య కార్యక్రమం కోసం పంచాయతీ ప్రతినిధులు, సామాజిక నాయకులు, ఐటీసీ అధికారులు అభివృద్ధి భాగస్వాములు ఒకచోట చేరి స్వచ్ఛత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ కిషోర్ శివరామ్ నాయక్, వైస్ సర్పంచ్, ఎన్నికైన ప్రతినిధులు, గ్రామ పెద్దలు, మండల పంచాయతీ అధికారి రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రవి, చెంగల్ రావు, డిప్యూటీ జనరల్ మేనేజర్-హెచ్ఆర్, ఐటీసీ పీఎస్పీడీ, బీసీఎం, సీనియర్ ఆర్. జయప్రకాష్, ఐటిసి మిషన్ సునేహ్రా కల్ ప్రోగ్రామ్ మేనేజర్, వాష్ ఇన్స్టిట్యూట్, మైరాడా, బంధన్, ప్రథమ్, ఐజీడీ హ్యాండ్ ఇన్ హ్యాండ్ సంస్థల ప్రతినిధులు క్షేత్రస్థాయి బృందాలు కూడా పాల్గొన్నాయి.



## ఆదర్శ కమ్యూనిస్టుగా లక్ష్మారెడ్డి

**వలిగొండ, మహా**: నేటితరానికి ఆదర్శ కమ్యూనిస్టుగా కొమ్మిడి లక్ష్మారెడ్డి నిలిచారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు అన్నారు. శుక్రవారం పులిగిల్ల గ్రామంలో మాజీ సర్పంచ్ కొమ్మిడి లక్ష్మారెడ్డి పార్థివదేహంపై ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నతనంలో పట్టిన ఎర్రజెండాను చివరి శ్వాస వరకు విడవకుండా ప్రజల కోసం పని చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో సీపీఎంలో చేరిన లక్ష్మారెడ్డి యువజన సంఘం నాయకుడిగా, పార్టీ నాయకుడిగా సేవలందించారని తెలిపారు. పులిగిల్ల గ్రామ సర్పంచ్‌గా 20 ఏళ్లపాటు పనిచేస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేయడంతో పాటు మండల స్థాయిలో ప్రజా ఉద్యమాలను నిర్మించారని పేర్కొన్నారు. పేదలు, రైతులు, కూలీలు, కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడారని అన్నారు. పదవుల కోసం ఎప్పుడూ పాకులాడకుండా యువతను ప్రోత్సహించి పార్టీ అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.డి. జహంగీర్, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు బొంతల చంద్రారెడ్డి మాట్లాడుతూ సుమారు 40 ఏళ్లపాటు పార్టీకి వివిధ హోదాల్లో సేవలందించారని గుర్తుచేశారు. ఆయన మరణం పార్టీకి, ప్రజా ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఘనమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## గాంధీ జయంతిని అవమాన పరిచిన వలిగొండలోని శ్రీ చైతన్య పాఠశాల

**వలిగొండ అక్టోబర్ 2 మహా న్యూస్ :** భారత జాతి యావత్తు అక్టోబర్ రెండు గాంధీ జయంతిని అంబరాన్ని అంటి సంబరాలు నిర్వహిస్తుంటే వలిగొండ పట్టణ కేంద్రంలోని శ్రీ చైతన్య విద్యా సంస్థ గాంధీ జయంతిని అవమాన పరుస్తూ పాఠశాలను నిర్వహిస్తు ప్రభుత్వ నిబంధనలను విద్యా ప్రమాణాలను పాటించకుండా తనదైన శైలిలో ప్రిన్సిపల్ వ్యవహరించడం పలువురు విద్యార్థి తల్లి దండ్రులను ఆందోళన గురవుతున్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి స్వతంత్ర సమరయోధుల త్యాగాలను నేర్పించాల్సిన విద్యాలయాలే వారి జయంతి మర్చిపోయి పాఠశాల నిర్వహిస్తుండడం శోచనీయం. ఈ విషయమై పాఠశాలకు మీడియా ప్రతినిధులు వెళ్ళగానే హుటాహుటిన విద్యార్థులను బయటికి పంపియడం గమనార్హం. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు ఎన్నో ఈ విద్యాలయంలో చోటుచేసుకున్నాయి. వెంటనే జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాధికారి శ్రీ చైతన్య పాఠశాల పై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



## పురస్కార గ్రహీతలకు ఆత్మీయ సన్మానం

**నిర్మల్ మహా :** తెలంగాణ రచయితల వేదిక నిర్మల్ జిల్లా ఆధ్వర్యంలో ఉదారి నాగదాసు కవిత పురస్కార గ్రహీత కవి తత్వ రచయిత అంతర్యామి కాలమిస్ట్ మునిమడుగుల రాజారావు, తెలంగాణ తల్లి రూపశిల్పి చిత్రకారుడు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిభ పురస్కార అవార్డు గ్రహీత బైరోజు వెంకట రమణ చారి ని ఘనంగా సన్మానించారు.స్థానిక లయన్స్ భవనంలో తెరవే అధ్యక్షుడు నేరెళ్ల హనుమంతు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి రచయిత ఉదారి సంస్థ అధ్యక్షులు తెలంగాణ రచయితల వేదిక ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు ఉదారి నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బహుముఖ ప్రజ్ఞావంతుడైన మునిమడుగుల రాజారావు కవిత్వంలోనూ తత్వంలోనూ ప్రత్యేకమైన ప్రయాణం సాగిస్తున్నారునీ, ఆయన తాత్విక వ్యాసాల ద్వారా ఎందరో మంది రచయితలను మెప్పిస్తున్నారని, తన కవిత్వంతో ప్రజలను చైతన్యవంతులు చేస్తున్నారని అందుకే న్యాయ నిర్ణేతలు మునిమడుగుల రాజారావు ను అవార్డుకు ఎంపిక చేశారని తెలిపారు. డాక్టర్ దామెర రాములు మాట్లాడుతూ బైరోజు వెంకటరమణాచారి కవిత్వం తెలంగాణ ప్రజల నుడికారంతో నిండి ఉంటుందని అందులో ఎంతో తాత్వికచింతన ఉంటుందని కొనియాడారు గొప్ప శిల్పకారుడు అయినందుకే ప్రతిభ పురస్కారం అందుకున్నారని ఆయనకు ఎంతో భవిష్యత్తు ఉందని కొనియాడారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతు తెరవే కవుల శిల్పకారుల రచయితల కృషిని గుర్తించి కీర్తించడం సన్మానించడం ఆరోగ్యకరమైదని, సమాజ చైతన్య పరిచే రచన లకు ఎంతో బలమని అన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు రమణారెడ్డి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. తె ర వే ఉపాధ్యక్షులు అంబటి నారాయణ కోశాధికారి పోలీస్ భీమేష్,పత్తి శివ ప్రసాద్ పద్య కవి డా. మురళీధర్, బొండింది పుర్షోత్తంరావ్, కామరాపు జగదీశ్వర్, నాగారం, అబ్బడి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతపై ఎస్సై సూచనలు

**మందమర్రి, మహా :** మందమర్రి పట్టణ పరిధిలోని ఆటో డ్రైవర్లు రహదారి భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మందమర్రి ఎస్సై గోపతి నరేష్ సూచించారు.ఆటోలకు ఉన్న సైడ్ మిర్రర్లు (రియర్ వ్యూ అద్దాలు) లోపలికి ముడిచి ఉంచడం, సరిగా లేకపోవడం వల్ల వెనుక నుంచి వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి ఆటోకు రెండు వైపులా సైడ్ మిర్రర్లు బయటికి, వెనుక ట్రాఫిక్ స్పష్టంగా కనిపించేలా అమర్చుకోవాలని ఆదేశించారు. టర్నింగ్ తీసుకునేటప్పుడు, ఓవర్ టేక్ చేసేటప్పుడు సైడ్ మిర్రర్లు చాలా కీలకమని, వీటిని సరిగా ఉపయోగించకపోవడం వల్ల ప్రమాదాల బారిన పడతారని వెల్లడించారు. ప్రయాణికుల సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా ప్రతి ఆటో డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు.నిబంధనలు ఉల్లంఘించి సైడ్ మిర్రర్లు లేకుండా,వాటిని సరిగా ఉపయోగించని ఆటోలపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ సూచనలను ఆటో డ్రైవర్లు పాటించి సురక్షిత ప్రయాణానికి కృషి చేయాలని ఎస్సై కోరారు.



### ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను

## వెంటనే అమలు చేయాలి

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేసిన కొండాపురం శ్రీనివాస్

**భువనగిరి, అక్టోబర్ 2మహా న్యూస్** : తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండాపురం శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. శుక్రవారం భువనగిరి మండలం నందనం గ్రామంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యే హాజరైన సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ ఆదేశాల మేరకు ఉద్యమకారులు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను వివరించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి 10 లక్షల ఆర్థిక సహాయం, ఉచిత బస్సు పాస్, నెలకు 25 వేల పింఛన్, హెల్త్ ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలను కల్పించాలని కోరారు. అదే విధంగా కేకే కమిటీ ద్వారా ఉద్యమకారులను త్వరగా గుర్తించి, ఆన్‌లైన్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి తప్పకుండా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే కేకే కమిటీ ద్వారా ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియలో జాప్యం జరగకుండా కమిటీ చైర్మన్ కేశవరావుతో మాట్లాడి త్వరితగతిన చర్యలు తీసుకునేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు కొండాపురం శ్రీనివాస్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు కొండాపురం గణేష్, ములుగు లక్ష్మయ్య, రత్నం యాదగిరి, మట్ట సైదులు గౌడ్, యాట అశోక్, బల్లెం అశోక్, అల్లంపల్లి లక్ష్మయ్య, అల్లంపల్లి శంకరయ్య, సూరి కుమార్ గౌడ్, కొండాపురం మొగులయ్యతో పాటు పలువురు ఉద్యమకారులు పాల్గొన్నారు.



## జనావాసాల్లోకి వచ్చిన కొండచిలువ..

**బెల్లంపల్లి,మహా**: బెల్లంపల్లి పట్టణంలోని రైల్వే స్టేషన్ ప్రాంత జనావాసాల్లోకి కొండచిలువ రావడంతో ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. సంబంధిత సమాచారాన్ని ఫారెస్ట్ అధికారులకు చేరవేయడంతో ఫారెస్ట్ రేంజర్ పూర్ణచందర్, డిప్యూటీ రేంజర్ రాంబాబు ,స్నేక్ క్యాచియర్ దినేష్ తో కలిసి కొండచిలువను పట్టుకోవడం జరిగింది .10 అడుగుల పొడవు 30 కిలోల బరువున్న కొండచిలువను సమీప అటవీ ప్రాంతంలోకి తీసుకువెళ్లి వదిలి వేయడం జరిగింది.



# అమిత్ షా పర్యటనకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- భద్రతా చర్యలపై సీపీ గౌష్ ఆలం సమీక్ష

**కరీంనగర్ మహా** : కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అక్టోబర్ 4న కరీంనగర్‌లో పర్యటించనున్న నేపథ్యంలో పోలీస్ శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. ప్రతిమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో నిర్వహించనున్న సిల్వర్ జూబ్లీ వేడుకలకు ఆయన హాజరుకానున్న నేపథ్యంలో అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ASL) సమావేశం నిర్వహించారు.కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కేంద్ర హోంమంత్రి పర్యటనకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. హెలిప్యాడ్, సభా వేదిక, పార్కింగ్ ప్రాంతాలు, ప్రవేశ -నిష్క్రమణ మార్గాలు, కార్యక్రమ ప్రదేశాల్లో భద్రతా చర్యలపై అధికారులతో చర్చించారు.భద్రతా విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సీపీ గౌష్ ఆలం సూచించారు. ప్రతి అంశాన్ని ముందుగానే క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అక్టోబర్ 4న ప్రతిమ మెడికల్ కాలేజీ సిల్వర్ జూబ్లీ వేడుకలతో పాటు ప్రతిమ డీమ్డ్ యూనివర్సిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన, సిల్వర్ జూబ్లీ పైలాన్ ఆవిష్కరణ, ఫొటో ఎగ్జిబిషన్, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.ASL సమావేశంలో పోలీస్ శాఖ ఉన్నతాధికారులు, వివిధ విభాగాల అధికారులు, ప్రతిమ మెడికల్ సైన్సెస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలను ప్రజా ప్రభుత్వం పరిష్కరించాలి

- తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్




**హనుమకొండ మహా** : జర్నలిస్టుల హక్కులు, భద్రత, సంక్షేమానికి సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం డిమాండ్ల దినోత్సవం నిర్వహించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని పబ్లిక్ గార్డెన్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి జర్నలిస్టులు నిరసన తెలిపారు. బ్యానర్ పట్టుకుని సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మహాత్మా గాంధీ విగ్రహానికి పూలదండలు వేసి పూలు సమర్పించి నివాళులర్పించారు. జర్నలిస్టుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయికి అందజేశారు. అలాగే వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజులను కలిసి సమస్యలను వివరించి వినతి పత్రాలు అందజేశారు.

**కొత్త మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి**

దేశంలో మారుతున్న మీడియా రంగ పరిస్థితులను సమగ్రంగా సమీక్షించి విధానపరమైన సిఫార్సులు చేసేందుకు కొత్త మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. జర్నలిస్టులు, మీడియా సిబ్బంది, వార్తా సంస్థల భద్రతకు ప్రత్యేక కేంద్ర చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు.కొత్త కార్మిక చట్టాల్లో విలీనమైన 1955, 1958 నాటి వర్కింగ్ జర్నలిస్టుల ప్రత్యేక చట్టాల ద్వారా గతంలో కల్పించిన హక్కులు, ఉద్యోగ భద్రత, పని గంటలు, వివాద పరిష్కార విధానాలు, సేవల విరమణకు సంబంధించిన రక్షణలను పునరుద్ధరించాలని కోరారు. ప్రింట్, ప్రసార, డిజిటల్ మీడియా ఉద్యోగులకు వర్తించేలా కొత్త వేతన బోర్డును వెంటనే ఏర్పాటు చేసి ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వేతనాలను సిఫార్సు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు వైద్య సదుపాయాలను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. స్వేచ్ఛాయుతమైన, ఆర్థికంగా భద్రమైన మీడియా వ్యవస్థ ప్రజాస్వామ్యానికి ఎంతో అవసరమని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం త్వరగా పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గడ్డం కేశవమూర్తి, ఊటుకూరు సీతారామారావు (సాయిరామ్), రాష్ట్ర హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, నేషనల్ కౌన్సిల్ సభ్యులు పీవీ మదన్మోహన్, గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకణాల సంతోష్, ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, జిల్లా కోశాధికారి పోలిశెట్టి విష్ణువర్ధన్, ప్రెస్ క్లబ్ కోశాధికారి బోలా అమర్, జిల్లా కార్యవర్గ ప్రతినిధులు విజయ్ భాస్కర్, గన్ను సంతోష్ కుమార్, రామారావు, ఉస్మాన్ పాషా, వాజీద్, దండు మోహన్, కొమ్మాలు బిక్షపతి, యాదవ్, విజయ్ భాస్కర్, నయీమ్ పాషా, చుక్కారావు, ముదిగిరి ఓదెలు, నల్లాల బుచ్చిరెడ్డి, ప్రమోద్, అల్లే రామారావు, ప్రదీప్, బి. శ్రీహరి రాజు తదితర నాయకులు పాల్గొన్నారు.



# ప్రజా నాయకుడిగా సాబీర్ పాషా సేవలు ప్రశంసనీయం

- ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్
- పాషాకు జన్మదిన శుభాకాంక్షలు సన్మానం

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** కింది స్థాయి నుంచి అంచలంచెలుగా ఎదుగుతూ ప్రజా నాయకుడిగా సాబీర్ పాషా గుర్తింపు పొంది సేవలందించడం ప్రశంసనీయమని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ పేర్కొన్నారు. సిపిఐ జిల్లా పార్టీ కార్యదర్శి ప్రజా నాయకుడు సాబీర్ పాషా జన్మదిన సందర్భంగా శుక్రవారం ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ బృందం పాషా గృహానికి వెళ్లి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ పాషా విద్యార్థి దశ నుండే విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేసినట్లుగా తెలిపారు. కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావుకు పాషా తోడుగా నిలుస్తూ నిరంతర సహకారం అందిస్తూ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించడం అభినందనీయమన్నారు. ఈ ఆత్మీయ అభినందన కార్యక్రమంలో సాబీర్ పాషా, ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ లతోపాటు కొత్తగూడెం పాల్వంచ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, ప్రముఖ కళాకారులు ప్రముఖ సంగీత దర్శకులు మారపాక కృష్ణస్వామి, స్వర సంగీత విద్వాన్ కలవల రాందాస్, సినీ నటులు తాండూర్ ధనరాజ్, అంబేద్కర్ సంక్షేమ సంఘం నాయకులు పి.సురేందర్, రాజేశ్వరరావు, యాకూబ్ తదితరులు ఉన్నారు.

# గాంధీజీ జీవితం స్ఫూర్తిదాయకం

**హనుమకొండ, మహా ;** జాతిపిత మహాత్మా గాంధీ 157 వ జయంతి సందర్భంగా హనుమకొండ నగరం లోని పబ్లిక్ గార్డెన్ లో శుక్రవారం గాంధీ విగ్రహానికి ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, మాజీ కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి తదితరులతో పాటు ప్రజా ప్రతినిధులు, అభిమానులు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ అహింస, సత్యం, శాంతి, సత్యాగ్రహం వంటి గొప్ప సిద్ధాంతాలతో భారత స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించారని అన్నారు. దేశ ప్రజలను ఏకతాటి పైకి తీసుకువచ్చి స్వాతంత్ర్య సాధనలో కీలక పాత్ర పోషించిన గాంధీజీ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాపూజీ సేవలను ప్రజా ప్రతి నిధులు, నాయకులు కొనియాడారు.




# గాంధీ, శాస్త్రి సేవలు మరువలేం

**రాజేంద్రనగర్, మహా**: జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి సేవలను దేశ ప్రజలు ఎప్పటికీ మరువలేరని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. వారి జయంతి సందర్భంగా శుక్రవారం మైలార్‌దేవపల్లిలోని తన నివాసంలో ఇరువురి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యం, అహింస అనే ఆయుధాలతో మహాత్మా గాంధీ దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు మార్గనిర్దేశం చేశారని పేర్కొన్నారు. లాల్ బహదూర్ శాస్త్రి 'జై జవాన్-జై కిసాన్' నినాదంతో సైనికులు, రైతుల సేవలను గౌరవిస్తూ దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపారని తెలిపారు. గాంధీ, శాస్త్రి ఆశయాలను నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వారి విలువలు, దేశభక్తి, సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఎన్. ధనుంజయ, టీ. ప్రేమ్ గౌడ్, మాధవ రెడ్డి, సుధాకర్ గౌడ్, సరికొండ వెంకటేష్, సాయిరెడ్డి, సుధాకర్, అడికే అర్జున్, భాషా శ్రీనివాస్, శేఖర్, లక్ష్మారెడ్డి, జగదీష్ బండారి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



# అల్లి కనకమ్మను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలి

- శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: అల్లి కనకమ్మను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన అల్లి కనకమ్మ ఇంటికి శుక్రవారం ఎమ్మెల్యే వెళ్లి కనకమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ ఆత్మీయ నివాళి కార్యక్రమంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో పాటు కొత్తగూడెం పాల్వంచ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా పార్టీ కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా, ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్, అపరబాలు అల్లి శంకర్, ప్రముఖ సంగీత దర్శకులు మారపాక కృష్ణస్వామి, స్వర సంగీత విద్వాన్ కలవల రాందాస్, సినీ నటులు తాండూర్ ధనరాజ్, కుటుంబ సభ్యులు అల్లిమల్లయ్య, అల్లి హనుమంతు, అల్లి రాఘవులు, అల్లి పవన్, అల్లి ప్రశాంత్ ఇంకా స్థానిక నాయకులు మద్దెల వెంకటయ్య, ఉల్లోజు వెంకట్, అంబేద్కర్ సంఘ నాయకులు పి.సురేందర్, రాజేశ్వరరావు, ఇంకా బంధుమిత్రులు పాల్గొన్నారు.

**అల్లి కనకమ్మ మృతికి కోనేరు చిన్ని నివాళులు..**

అల్లి కనకమ్మ మృతి పట్ల కాంగ్రెస్ నాయకులు కోనేరు సత్యనారాయణ (చిన్ని) సంతాపాన్ని తెలియజేసి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ ఆత్మీయ నివాళి కార్యక్రమంలో కోనేరు సత్యనారాయణ (చిన్ని)తో పాటు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్, అపరబాలు అల్లి శంకర్, కొత్తగూడెం కార్పొరేటర్లు రావి రాంబాబు, హరిహరన్, దళిత నాయకులు సబ్బారపు మధుసూదన్ (చిన్ని), ప్రముఖ కళాకారులు సంగీత దర్శకులు మారపాక కృష్ణస్వామి, స్వర సంగీత విద్వాన్ కలవల రాందాస్, సినీ నటులు తాండూర్ ధనరాజ్, అంబేద్కర్ సంఘ నాయకులు పి.సురేందర్, రాజేశ్వర రావు, మద్దెల వెంకటయ్య, ప్రముఖ అంబేద్కర్ వాది ఊల్లోజు వెంకట్, పోగుల కోటేశ్వరరావు, కుటుంబ సభ్యులు అల్లిమల్లయ్య, అల్లి హనుమంతు, అల్లి రాఘవులు, అల్లిపవన్ అల్లి ప్రశాంత్, ఇంకా బంధుమిత్రులు పాల్గొన్నారు.



# సత్యం,అహింస తో పోరాడిన గొప్ప దార్శనికుడు మహాత్మ గాంధీ

- మాజీ మంత్రి కొండా సురేఖ

**వరంగల్, మహా** : గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం వరంగల్ పోస్ట్ ఆఫీస్ స్టేషన్ రోడ్డు లో గల మహాత్మగాంధీ విగ్రహనికి మాజీ మంత్రి కొండా సురేఖ పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ గాంధీ సిద్ధాంతాలను దృష్టిలో ఉంచుకొని నవ భారత నిర్మాణానికి మనమందరం పనిచేయాలి తెపిపారు. మహాత్మా గాంధీ సత్యం, అహింస, శాంతి, సామరస్యాన్ని ఆయుధాలుగా చేసుకుని దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించారని,గాంధీజీ చూపిన సత్యం, అహింస మార్గాలు నేటి సమాజానికి కూడా ఎంతో ఆదర్శప్రాయమని మాజీ మంత్రి కొండా సురేఖ అన్నారు. గాంధీజీ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని, సమాజంలో శాంతి, సోదరభావం, సామాజిక సమానత్వాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని మాజీ మంత్రి సురేఖ పిలుపునిచ్చారు.గాంధీజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అని సురేఖ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మీసాల ప్రకాష్, జిల్లా సీనియర్ నాయకులు గోపాల్ నవీన్ రాజ్, మాజీ కార్పొరేటర్లు చింతాకుల అనిల్ కుమార్, చింతాకుల సునీల్, ముఖ్య నాయకులు జన్ను శ్యామ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మికి పుష్కరకాలం



**దమ్మపేట, మహా**: పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించిన కళ్యాణలక్ష్మి పథకం 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బీఆర్ఎస్ అశ్వారావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు శుక్రవారం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 అక్టోబర్ 2న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచాయని అన్నారు. ఇప్పటివరకు లక్షలాది కుటుంబాలకు ఆర్థిక సాయం అందిందని పేర్కొన్నారు. తొలుత రూ.51 వేలతో ప్రారంభమైన సాయాన్ని దశలవారీగా రూ.1,00,116కు పెంచిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. పేద కుటుంబాల కష్టాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఈ పథకం ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమవుతోందని మెచ్చా విమర్శించారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన తులం బంగారం అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. ప్రభుత్వం వద్ద నిధులు లేకపోవడంతో హామీని అమలు చేయలేకపోతున్నారని విమర్శించారు. కళ్యాణలక్ష్మి చెక్కుల విషయంలోనూ లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించి, గడువు ముగిసిన చెక్కుల స్థానంలో కొత్త చెక్కులు లేదా నేరుగా నగదు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ మేరకు తులం బంగారం అందించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే పేదల పక్షాన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బెల్లంపల్లిలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

**బెల్లంపల్లి, మహా**: బెల్లంపల్లి పట్టణంలోని పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలతో పాటు మాజీ ప్రధాని దివంగత లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను కాంగ్రెస్ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవుల సూచనలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ మున్సిపల్ చైర్పర్సన్ దావస్వాదితో పాటు పిసిసి మెంబర్ చిలుముల శంకర్లు మాట్లాడుతూ గాంధీజీ సహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం/శాసనోల్లంఘన ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమం వంటి పోరాటాలు స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకంగా నిలిచాయని,స్వాతంత్ర్యం కోసం సాగిన మహా పోరాటానికి మార్గదర్శి మహాత్మా గాంధీజీ అని ,బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సత్యం, అహింసను ఆయుధాలుగా చేసుకుని ప్రజలను ఏకం చేసిన మహానేత,సహాయ నిరాకరణ ఉద్యమంతో ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను రగిలించారనీ ఆయన సేవలను కొనియాడారు.లాఠీలు ఎదురైన ,జైలు శిక్షలు ఎదురైనా స్వాతంత్ర్య లక్ష్యం నుంచి వెనక్కి తగ్గని సంకల్పమే గాంధీజీ పోరాటం,ఆయన చూపిన సత్యం, అహింస మార్గం భారతస్వాతంత్ర్యచరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు.నిజాయితీకి నిలువెత్తు రూపం... దేశభక్తికి చిరునామా -లాల్ బహదూర్ శాస్త్రి అని,సాదాసీదా జీవితం ఉన్నతమైన ఆలోచనలు. దేశం కోసం అంకితమైన ప్రతి అడుగు ఆయనను మహోన్నత నాయకుడిగా నిలిపిందని, దేశ ప్రజల్లో ధైర్యాన్ని నింపుతూ "జై జవాన్ -జై కిసాన్" అనే నినాదంతో సైనికుడిని, రైతును గౌరవించిన మహనీయుడని వివరించారు.



జయంతి కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు మల్లారపు చిన్న రాజం, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గెల్లి రాజలింగు, డిసిసి సెక్రెటరీ జమ్మికుంట విజయ్ పట్టణ జనరల్ సెక్రటరీ కర్నూల్ వెంకటేష్ అధికార ప్రతినిధి దేవస్థానం ఆనంద్ యూత్ కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఆదర్శ వర్ధన్ , పట్టణ జనరల్ సెక్రెటరీ దెబ్బటి రమేష్ ,నాయకులు భూపెల్లి రాజేశ్వర్,కంకటి శ్రీనివాస్,వెంకటస్వామి, మాజీ కౌన్సిలర్లు గుజ్జ రవి, గుజ్జ కృష్ణ, గౌస్ భాయ్ మైనార్టీ పట్టణ అధ్యక్షులు ఒజియర్ బాయ్, రేగుంట రాజలింగు, రాసబత్తుల వెంకటి, ఆరకొండ మొండి, దాసరి రాజలింగు, మీర్జా ఖదీర్ బేగ్, అరకొండ శేఖర్, కుంభాల రాజేష్, అంకం రవి, రామిల్ల ప్రదీప్, కాంపెల్లి సతీష్, మచ్చ సాయికుమార్ యాదవ్, కాల్వల కేశవులు, చింతల లోకేష్, SK అలీభాయ్, గద్దల కుమార్, పాముల రాజలింగు, నంది కొమురయ్య, సుకసి కృష్ణ, పట్నం చక్రధర్, లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగాలు అధ్యక్షులు, 34 వార్డుల ముఖ్య కార్యకర్తలు, పొరండ్ల సత్యవతి, తులసి, మీసాల పద్మ, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు.

# టియుడబ్ల్యుజే మండల కమిటీ ఎన్నిక

- అధ్యక్షుడిగా సిహెచ్ నరసింహారావు
- ప్రధాన కార్యదర్శిగా సంఘం నాగరాజు ఏకిగ్రీవ ఎన్నిక



**జూలూరుపాడు, మహా** : తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజేయు) జూలూరుపాడు మండల నూతన కమిటీ నీ ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ప్రజాపక్షం విలేఖరి చాపలమడుగు నరసింహారావు, ప్రధాన కార్యదర్శిగా మహా పత్రిక విలేఖరి సంఘం నాగరాజు ను మండల యూనియన్ సభ్యులు ఏకీగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ మేరకు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజేయు) భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు జాగు వెంకటరత్నం, జిల్లా ప్రధాన కార్యదర్శి జూనుమల రమేష్ లు శుక్రవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం మాట్లాడుతూ మండలంలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు.

నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం, జిల్లా కమిటీ పిలుపుమేరకు కార్యక్రమాలను చేపడుతూ నిరంతరం యూనియన్ ప్రతిష్ట కోసం శక్తి వంచన లేకుండా పని చేస్తామని తెలిపారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన తోటి జర్నలిస్ట్ మిత్రులకు, జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన యూనియన్ అధ్యక్ష కార్యదర్శులకు పలువురు జర్నలిస్టులు, నాయకులు అభినందనలు తెలిపారు.

# పాఠశాల నిర్వహణపై చర్యలు తీసుకోవాలి



**వలిగొండ, అక్టోబర్ 2, మహా**: జాతీయ సెలవు దినమైన గాంధీ జయంతి రోజున పాఠశాలను నిర్వహించిన శ్రీ చైతన్య యాజమాన్యంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షులు సుద్దాల సాయికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం వలిగొండలో ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2న జాతీయ సెలవు ఉన్నప్పటికీ పాఠశాలలో తరగతులు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని ఆరోపించారు. జాతీయ నాయకుల జయంతులు, జాతీయ పండుగల ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేయాల్సిన బాధ్యత విద్యాసంస్థలపై ఉందన్నారు. సెలవు దినాన పాఠశాల నిర్వహించినట్లు వచ్చిన ఆరోపణలపై విద్యాశాఖ అధికారులు వెంటనే విచారణ చేపట్టాలని కోరారు. నిబంధనల ఉల్లంఘన నిర్ధారణ అయితే శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యంపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపార దృక్పథంతో కాకుండా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతగా భావించాలని సూచించారు. విద్యార్థులపై అనవసరమైన ఒత్తిడిని తగ్గించడంతో పాటు విద్యాశాఖ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు విద్యాసంస్థలపై పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని సుద్దాల సాయికుమార్ కోరారు.




# నవంబర్ 20న 'ఓం' విడుదల

హైదరాబాద్, మహా: ధనుష్, మలయాళ స్టార్ మమ్ముట్టి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న భారీ యాక్షన్ చిత్రం 'ఓం' విడుదల తేదీ ఖరారైంది. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నవంబర్ 20, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. గతంలో అక్టోబర్ 16న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయించినప్పటికీ, పలు కారణాలతో విడుదల వాయిదా పడింది. 'అమరన్' చిత్రంతో గుర్తింపు పొందిన రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ధనుష్, మమ్ముట్టి తొలిసారి కలిసి నటిస్తున్నారు. సాయిపల్లవి, శ్రీలీల కథానాయికలుగా కనిపించనుండగా.. బాలీవుడ్ నటుడు నసీరుద్దీన్ షా, ఇంద్రన్స్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ కాంబినేషన్ కారణంగా సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. మొదట దసరా సందర్భంగా అక్టోబర్ 16న విడుదల చేయాలని మేకర్స్ భావించారు. అయితే అక్టోబర్ 15న రజనీకాంత్ నటించిన 'జైలర్ 2' విడుదల కానుండటంతో రెండు భారీ చిత్రాల మధ్య పోటీని నివారించేందుకు 'ఓం'ను వాయిదా వేశారు. అనంతరం దీపావళి విడుదలకు కూడా దూరంగా ఉండాలని చిత్ర బృందం నిర్ణయించింది. ఇప్పుడు నవంబర్ 20 తేదీని అధికారికంగా ప్రకటించడంతో సినిమా విడుదలపై స్పష్టత వచ్చింది. రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ చిత్రంలో తొలి భాగానికి 'చాప్టర్ 1' అనే ట్యాగ్‌లైన్ ఉంది. కథలో ఎర్రచందనం నేపథ్యంలో సాగే అంశాలు ఉన్నట్లు ఇప్పటికే విడుదలైన టీజర్ ద్వారా తెలుస్తోంది. ధనుష్ ఈ సినిమాలో చెట్లను నరికే కూలీ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ధనుష్ స్వయంగా నిర్మాణంలో భాగస్వామిగా ఉన్న ఈ చిత్రానికి సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు. ఎళిల్ అరసు కెమెరా బాధ్యతలు నిర్వహిస్తుండగా, ఆర్.కలైవానన్ ఎడిటింగ్ చేస్తున్నారు. నవంబర్ 20న పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.



# డిసెంబర్‌లో చరణ్–సుకుమార్ షూటింగ్

హైదరాబాద్, మహా: గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న 'RC17'పై మరో ఆసక్తికరమైన అప్‌డేట్ వెలువడింది. 'రంగస్థలం' తర్వాత ఈ ఇద్దరూ మరోసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం దర్శకుడు సుకుమార్ స్క్రిప్ట్‌కు తుది మెరుగులు దిద్దుతున్నట్లు సమాచారం . ఈ సినిమాను విజయదశమి సందర్భంగా అక్టోబర్ 20న అధికారికంగా ప్రారంభించేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. పూజా కార్యక్రమాలను గ్రాండ్‌గా నిర్వహించిన అనంతరం రెగ్యులర్ షూటింగ్‌ను డిసెంబర్ నుంచి ప్రారంభించాలని మేకర్స్ ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం. భారీ స్థాయిలో తెరకెక్కనున్న ఈ చిత్రానికి సంబంధించిన కీలక నటీనటులు, ఇతర వివరాలను కూడా ప్రారంభోత్సవ సమయంలో వెల్లడించే అవకాశం ఉందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. 'RC17'ను మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మించనున్నాయి. కథ, పాత్రల విషయంలో దర్శకుడు సుకుమార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ సినిమా హీరోయిన్, ఇతర కీలక పాత్రల విషయంలో పలువురు నటీనటుల పేర్లు ప్రచారంలోకి వచ్చినప్పటికీ, అధికారికంగా ఎలాంటి పూర్తి వివరాలు ప్రకటించలేదు. సంగీత దర్శకుడి విషయంలోనూ ప్రస్తుతం పలు పేర్లు వినిపిస్తున్నాయి.షూటింగ్ మొదలైన తర్వాత సినిమాను వేగంగా పూర్తి చేయాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తాజా సమాచారం. షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా ముందుగానే ప్రణాళిక చేసుకుని, దాదాపు ఏడాది వ్యవధిలో ప్రధాన నిర్మాణ పనులను పూర్తి చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ కోసం భారీ నిర్మాణ విలువలతో సెట్స్, యాక్షన్ సన్నివేశాలు, ఇతర కీలక అంశాలను సిద్ధం చేసే అవకాశం ఉంది. ఇక రామ్ చరణ్ ప్రస్తుతం తన చేతి గాయం నుంచి కోలునే ప్రక్రియలో ఉన్నారు. తాజా సమాచారం ప్రకారం ఆయన చేతికి అమర్చిన రాడ్స్, క్యాస్ట్‌ను వైద్యులు తొలగించారు. తదుపరి దశలో ఫిజియోథెరపీ కొనసాగనుంది. రికవరీ పూర్తయ్యాక షూటింగ్‌లో పాల్గొనేలా షెడ్యూల్‌ను రూపొందిస్తున్నట్లు సమాచారం.'రంగస్థలం' తర్వాత రామ్ చరణ్, సుకుమార్ కలయికలో వస్తున్న సినిమా కావడంతో 'RC17'పై సహజంగానే అంచనాలు పెరిగాయి. ప్రస్తుతం అధికారిక ప్రకటనల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# వైట్–బ్లూ లుక్‌లో రాశీ ఖన్నా

హైదరాబాద్, మహా: టాలీవుడ్ ప్రేక్షకులకు సుపరిచితమైన కథానాయిక రాశీ ఖన్నా తన తాజా ఫ్యాషన్ లుక్‌తో మరోసారి ఆకట్టుకున్నారు. వైట్, బ్లూ రంగుల కలయికతో రూపొందించిన సంప్రదాయ దుస్తుల్లో ఆమె మెరిసిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో అభిమానులను ఆకర్షిస్తున్నాయి. తెలుపు, నీలం రంగుల ప్రింట్‌తో కూడిన అందమైన దుస్తులను రాశీ ఖన్నా ధరించారు. దీనికి పారదర్శకమైన డిజైన్‌తో, ముత్యాల అలంకరణ కలిగిన బ్లౌజ్‌ను జత చేశారు. సాధారణతకు ప్రాధాన్యం ఇస్తూనే స్టైలిష్‌గా కనిపించేలా దుస్తులు, ఆభరణాలను సమన్వయం చేసుకోవడం ఈ లుక్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గోల్డ్ జ్యువెలరీతో పాటు హై పోనీటైల్ హెయిర్‌స్టైల్ ఆమె రూపానికి మరింత అందాన్ని తీసుకొచ్చింది. ఓ ప్రత్యేక కార్యక్రమం సందర్భంగా రాశీ ఖన్నా ఈ లుక్‌లో కనిపించారు. ప్రముఖ స్టైలిస్టులు, మేకప్, హెయిర్ ఆర్టిస్టుల సమన్వయంతో ఈ రూపాన్ని తీర్చిదిద్దినట్లు ఆమె ఫొటోషూట్ వివరాలు వెల్లడిస్తున్నాయి. మొత్తం లుక్‌లో సంప్రదాయ ఛాయలు, ఆధునిక ఫ్యాషన్ కలయిక కనిపించింది. మోడ్రన్ దుస్తులతో పాటు సంప్రదాయ శైలిలోనూ తనదైన ఫ్యాషన్ సెన్స్‌ను ప్రదర్శిస్తూ రాశీ ఖన్నా తరచూ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఈసారి వైట్–బ్లూ కలర్ కాంబినేషన్‌లో ఆమె ఇచ్చిన ఫ్యాషన్ స్టేట్‌మెంట్ నెటిజన్లను ఆకట్టుకుంటోంది. రాశీ ఖన్నా నటనతో పాటు తన స్టైలింగ్, ఫొటోషూట్లతోనూ సోషల్ మీడియాలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటున్నారు.







# కత్రినా.. కొడుకుతో ఆ క్షణాలు

ముంబై, మహా: బాలీవుడ్ నటుడు విక్కీ కౌశల్ తన కుటుంబానికి సంబంధించిన విషయాలను తాజాగా పంచుకున్నారు. భార్య కత్రినా కైఫ్, కుమారుడు విహాన్‌తో కలిసి గడుపుతున్న సమయాలు తనకు ఎంతో ప్రత్యేకమైనవని ఆయన చెప్పినట్లు సమాచారం. ముఖ్యంగా తండ్రిగా తన జీవితంలో చోటుచేసుకున్న మార్పులు, కుటుంబంతో కలిసి గడిపే క్షణాల గురించి విక్కీ భావోద్వేగంగా మాట్లాడినట్లు తెలుస్తోంది. కెరీర్‌లో వరుస సినిమాలతో బిజీగా ఉండే విక్కీకి కుటుంబంతో గడిపే సమయం ఎంతో విలువైనదిగా మారింది. సినిమా షూటింగ్‌లు, ప్రయాణాలు, ఇతర కార్యక్రమాలతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ భార్య, కుమారుడితో ఉండే క్షణాలను ఆస్వాదించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆయన వ్యాఖ్యల ద్వారా తెలుస్తోంది. కుమారుడి ఎదుగుదలను దగ్గరుండి చూడటం తనకు కొత్త అనుభూతిని ఇస్తోందని చెప్పినట్లు సమాచారం. ఇటీవల తండ్రిగా మారిన తర్వాత తన ఆలోచనా విధానంలో కూడా మార్పు వచ్చినట్లు విక్కీ పేర్కొన్నట్లు కథనం చెబుతోంది. చిన్నారి చేసే ప్రతి పని, అతడి ఎదుగుదలలోని ప్రతి దశను ఆస్వాదించాలని అనిపిస్తోందని, ఆ క్షణాలను తొందరగా దాటేయకుండా కాస్త ఆగి ఆస్వాదించాలనిపిస్తోందని ఆయన భావోద్వేగంగా చెప్పినట్లు తెలుస్తోంది. అందుకే 'జస్ట్ వాంట్ టు పాజ్' అంటూ తన మనసులోని భావాన్ని వ్యక్తం చేసినట్లు సమాచారం. కత్రినా కైఫ్, విక్కీ కౌశల్ 2021లో వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి ఈ జంటకు సంబంధించిన వ్యక్తిగత విషయాలపై అభిమానుల్లో ఆసక్తి కొనసాగుతోంది. అయితే తమ వ్యక్తిగత జీవితాన్ని ఎక్కువగా బహిరంగంగా పంచుకోకుండా ఈ జంట జాగ్రత్తగా వ్యవహరిస్తూ వస్తోంది. తాజాగా కుటుంబం, కుమారుడి గురించి విక్కీ చేసిన వ్యాఖ్యలు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.





# ప్రియదర్శి నటనకు అభిమాని కన్నీళ్లు

హైదరాబాద్, మహా: నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన 'ది ప్యారడైజ్' సినిమా ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ చిత్రంలో నటుడు ప్రియదర్శి పోషించిన శంకరన్న పాత్ర ప్రేక్షకుల దృష్టిని ప్రత్యేకంగా ఆకర్షిస్తోంది. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పోలిన ఆహార్యం, మాట తీరు, హావభావాలతో ప్రియదర్శి కనిపించడంతో థియేటర్లలోనూ, సామాజిక మాధ్యమాల్లోనూ ఈ పాత్రపై చర్చ సాగుతోంది. సినిమాలో ఎమ్మెల్యే శంకరన్నగా ప్రియదర్శి కనిపిస్తారు. పాత్ర కోసం ఆయన లుక్‌ను ప్రత్యేకంగా తీర్చిదిద్దినట్లు చిత్ర బృందం తెలిపింది. తెలంగాణ యాస, బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీతో ప్రియదర్శి పాత్రకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ముఖ్యంగా సినిమాలోని కొన్ని సన్నివేశాలు, డైలాగులు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో ఈ పాత్రపై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. ఇదిలా ఉండగా, తాజాగా ప్రియదర్శిని కలిసిన ఓ మహిళా అభిమాని భావోద్వేగానికి గురయ్యారు. తెరపై శంకరన్న పాత్రలో ప్రియదర్శిని చూసిన తర్వాత కేసీఆర్‌ను గుర్తు చేసుకున్న ఆమె.. ప్రియదర్శి నటనను ప్రశంసిస్తూ కన్నీళ్లు పెట్టుకున్నారు. 'అచ్చం కేసీఆర్‌లా అనిపించావు' అంటూ తన అభిమానాన్ని వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. సినిమా విడుదలకు ముందు ప్రియదర్శి పోషిస్తున్న పాత్రను చిత్ర బృందం పెద్దగా వెల్లడించలేదు. సినిమా థియేటర్లలోకి వచ్చిన తర్వాత శంకరన్న పాత్ర ప్రేక్షకులకు పరిచయం కావడంతో ఒక్కసారిగా ఆసక్తి పెరిగింది. ఈ పాత్ర కోసం ప్రియదర్శి ప్రత్యేకంగా సిద్ధమయ్యారని, పాత్రకు సంబంధించిన అంశాలపై స్వయంగా పరిశోధన చేశారని దర్శకుడు శ్రీకాంత్ ఓదెల గతంలో వెల్లడించారు. పాత్ర గురించి తొలుత విన్నప్పుడు కొంత భయం కలిగిందని, అయితే దాన్ని సవాల్‌గా తీసుకుని నటించినట్లు ప్రియదర్శి పేర్కొన్నట్లు వార్తలు వచ్చాయి.ప్రియదర్శి నటనకు పలువురు ప్రేక్షకుల నుంచి ప్రశంసలు వస్తుండగా, ఈ పాత్ర సినిమా చర్చల్లో ప్రత్యేకంగా నిలుస్తోంది.

# 'సిగ్మా'.. క్రైమ్ థ్రిల్లర్ ఎలా ఉంది?

హైదరాబాద్, మహా: తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమైన చిత్రం 'సిగ్మా'. సందీప్ కిషన్, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. క్రైమ్, యాక్షన్, హీస్ట్ అంశాలను కలిపి రూపొందించిన ఈ చిత్రంపై విడుదలకు ముందే ఆసక్తి ఏర్పడింది. మరి ఈ సినిమా ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంది? కథ విషయానికి వస్తే.. గురు (సందీప్ కిషన్) తన తల్లి జ్ఞాపకంగా మిగిలిన ఇంట్లోనే ఉంటూ ఓ లైబ్రరీని నిర్వహిస్తుంటాడు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న అతడి జీవితంలో అనూహ్యంగా ఓ భారీ మొత్తానికి సంబంధించిన వ్యవహారం ప్రవేశిస్తుంది. మరోవైపు కోట్లాది రూపాయల డబ్బును దక్కించుకునేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నిస్తుంటారు. ఈ క్రమంలో కీలకమైన ఓ వస్తువు గురు చేతికి రావడంతో కథలో అసలు సంఘర్షణ మొదలవుతుంది. ఆ డబ్బు కోసం జరిగే వేటలో గురు ఎలా చిక్కుకున్నాడు? చివరకు అతడు ఎలాంటి నిర్ణయం తీసుకున్నాడు? అనేదే సినిమా ప్రధాన కథాంశం. దర్శకుడిగా జేసన్ సంజయ్ కొత్త ప్రయత్నం చేసినప్పటికీ, కథనం విషయంలో పూర్తిగా కొత్తదనాన్ని చూపించలేకపోయారనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. హీస్ట్ థ్రిల్లర్‌కు అవసరమైన వేగం, ఉత్కంఠ కొన్ని సందర్భాల్లో తగ్గిపోయినట్లు సమీక్షలు పేర్కొన్నాయి. ముఖ్యంగా కథలోని కొన్ని కీలక అంశాలు ప్రేక్షకులకు పూర్తిగా నమ్మదగినవిగా అనిపించవని, కొన్ని సన్నివేశాల్లో లాజిక్ ప్రశ్నార్థకంగా మారుతుందని విమర్శకులు అభిప్రాయపడ్డారు.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com